

మంత్రి లోకేష్ నిరంతర పర్యవేక్షణతో
నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ బాధితులకు
భరోసా లభించింది. వారిని ఇండియాకి
రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రతి
రెండు గంటలకు మాట్లాడి ఆత్మస్థైర్యం
కల్పిస్తున్న లోకేష్, సాయంత్రానికి
స్వస్థలాలకు పంపే చర్యలు
తీసుకుంటున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 11.09.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 146 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ఫలించిన మంత్రి నారా లోకేష్ కృషి



- తొలివిడతగా బీహార్ బార్డర్ కు 22మంది తరలింపు
- రేపు నేపాల్ బాధితుల తరలింపునకు రంగం సిద్ధం
- ఖాట్మాండూ నుంచి ప్రత్యేక విమానాల ఏర్పాటు
- నేపాల్ బాధితులకు మంత్రి నారా లోకేష్ భరోసా!
- సిఎస్, ఉన్నతాధికారులతో ఆర్టీజిఎస్ లో సమీక్ష
- ఎపి భవన్ అధికారులతో మంత్రి లోకేష్ వీడియో కాన్ఫరెన్స్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్ లో చిక్కుకున్న తెలుగు పౌరులను తరలించేందుకు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ ఉదయం నుంచి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. నేపాల్ లోని 12 ప్రదేశాల్లో చిక్కుకున్న 217మందిని సురక్షితంగా రాష్ట్రానికి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. తొలివిడతగా నేపాల్ లోని హెటౌడా నుంచి 22మంది తెలుగు పౌరులను సురక్షితంగా బీహార్ బార్డర్ కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. మిలటరీ సాయంతో హెటౌడా నుంచి 58 కి.మీ దూరంలో ఉన్న బీహార్ బోర్డర్ మోతిహరికి తెలుగుపౌరులు బయలుదేరారు. బీహార్ లోని మోతిహరి నుంచి తెలుగుపౌరులను రాష్ట్రానికి తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. నేపాల్ లో చిక్కుకున్న 217మందిలో 118మంది మహిళలు కాగా, 99మంది పురుషులు ఉన్నారు. విశాఖపట్నం వాసులు 42మంది, విజయనగరం 34మంది, కర్నూలుకు చెందిన వారు 22మంది కాగా, మిగిలిన వారు ఇతర జిల్లాలకు చెందిన వారు. తమను క్షేమంగా తరలిస్తున్న మంత్రి లోకేష్ కు తెలుగు ప్రజలు తెలిపారు. నేపాల్ లో చిక్కుకున్న 217మంది తెలుగు పౌరుల్లో 173మంది ఖాట్మాండూ పరిసరాల్లోని హెూటళ్లలో తలదాచుకున్నారు. 22మంది హెటౌడాలో (ప్రస్తుతం వీరు మిలటరీ సాయంతో బయలుదేరారు), 10మంది ఖాట్మాండూకు సమీపంలోని పోఖ్రాలో, 12మంది సిమి కోట్ లో ఉన్నారు.

**ఖాట్మాండూ నుంచి ప్రత్యేక విమానం :** ఖాట్మాండు పరిసరాల్లో ఉన్న 173మందిని తరలించేందుకు ఇండిగో-360 విమానం ఉదయం 10గంటలకు డిల్లీ నుంచి ఖాట్మాండు చేరుకుంటుంది. ఖాట్మాండూలో రేపు కర్ఫ్యూ సడలించిన వెంటనే వీరందరినీ విశాఖపట్నం, విజయవాడ తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఎపి భవన్ అధికారులు ఖాట్మాండూ లోని తెలుగుపౌరులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. తెలుగుపౌరుల లిస్టును తరలిచేసి బోర్డింగ్ పాసులను సిద్ధం చేస్తున్నారు. నేపాల్ సైన్యంతో సమన్వయం చేసుకొని ఉదయం హెూటళ్లనుంచి తెలుగుపౌరులను విమానాశ్రయానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. సిమికోట్ లో చిక్కుకున్న 12మంది పౌరులను బుద్ధ ఎయిర్ విమానంలో రేపు ఉదయం 9గంటలకు యుపి సరిహద్దుల్లోని నేపాల్ గంజ్ కి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఒకవేళ విమానంలో తరలింపు సాధ్యం కాకపోతే హెలీకాప్టర్లను కూడా సిద్ధంగా ఉంచారు. పోఖ్రాలోని 10మందిని 14సీటర్ చార్టర్డ్ విమానం ద్వారా నేపాల్ గంజ్ తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇందుకు నేపాల్ వైమానిక దళ అనుమతి కావాల్సి ఉంది. ఇందుకోసం సంప్రదింపులు చేస్తున్నారు. నేపాల్ గంజ్ చేరాక వారందరినీ రోడ్డుమార్గం ద్వారా లక్నోకి తరలించేందుకు ఉత్తరప్రదేశ్ అధికారులతో సమన్వయం చేస్తున్నారు.

**ఉదయం నుంచే నిరంతర సంప్రదింపులు :** బాధితులను సురక్షితంగా రాష్ట్రానికి చేర్చేందుకు మంత్రి నారా లోకేష్ శాయశక్తులా కృషిచేస్తున్నారు. నేపాల్ బాధితుల విషయం తెలుసుకున్న వెంటనే

మిగతా 2లో...

## రాష్ట్రాభివృద్ధి, ప్రజల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ అజెండా

- అనంతలో అధరహెూ అనిపించిన సూపర్ సిక్స్ సభ
- విజయోత్సవ బహిరంగ సభకు భారీగా ప్రజలు పార్టీ శ్రేణులు హాజరు
- ప్రజల దీవెనలతో హిట్ కూటమి కాంబినేషన్ కొనసాగుతుందని ప్రకటన
- రామరాజ్యం లక్ష్యంగానే కూటమి సుపరిపాలన
- ఎప్పుడు ఎన్నికలు పెట్టినా ఒన్ సైడ్ గా గెలిపించండి
- సూపర్ సిక్స్ విజయోత్సవ వేదికగా ఆటో డ్రైవర్లకు కానుక
- దసరాకు ఆటో డ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించిన సీఎం
- రప్పారప్పా అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరిక



**అనంతపురం (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి పార్టీలు తొలిసారిగా ఉమ్మడిగా అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ విజయోత్సవ సభ అదరహెూ అనిపించింది. బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ప్రజల ఆశీర్వాదంతో తమ హిట్ కాంబినేషన్ కొనసాగుతుందని కూటమి నేతలు సభా వేదికగా ప్రకటించారు. అనంతపురంలోని ఇంద్రప్రస్తానగర్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి 15 నెలల పాలనా విజయాలపై ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ బంపర్ హిట్ అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సహా టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలకు చెందిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఈ భారీ బహిరంగ సభకు హాజరయ్యారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సభా వేదికపైకి వస్తూనే కూటమి అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, మాధవ్ లు సూపర్ సిక్స్ జెండాలతో ర్యాంప్ పైకి వెళ్లి పార్టీ శ్రేణులకు, ప్రజలకు అభివాదం చేశారు. జెండాలు ఊపుతూ ఉత్సాహ పరిచారు. ప్రతిగా ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అమితమైన స్పందన కనిపించింది. ఈలలు వేస్తూ, జైసీబీఎన్, పవన్ కల్యాణ్ అంటూ నినాదాలతో విజయోత్సవ సభా ప్రాంగణం మార్మోగింది. అనంతరం మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు రామరాజ్యం లక్ష్యంగానే కూటమి పరిపాలన సాగుతుందని ప్రకటించారు. సభావేదిక నుంచి ఆటో డ్రైవర్లకు అనుకోని కానుకను ప్రకటించారు. దసరా రోజున ఆటో డ్రైవర్లందరి కి ఆర్థిక సాయం కింద రూ. 15 వేల రూపాయల్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఏటా ఈ మొత్తాన్ని ఆర్థికసాయంగా వారికి

మిగతా 2లో...



## అభివృద్ధే లక్ష్యం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ అభివృద్ధిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అనంతపురం లో నిర్వహించిన సూపర్ 6... సూపర్ హిట్ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రస్తావన తీసుకొచ్చారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెప్పారు. కూటమి నాయకులంగా చిత్తశుద్ధితో పని చేస్తున్నామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందులు పీడుస్తున్నాయని, అయినా సరే సూపర్ 6 హామీలను నెరవేర్చామని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షల ఆరోగ్య బీమా కల్పించామని చెప్పారు. ఒకే రోజులో గ్రామ సభలు నిర్వహించామని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి సైతం శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచామన్నారు. చట్ట పరంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు.

## నేపాల్ లో చిక్కుకున్న ఏపీ బాధితులకు భరోసా



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** మంత్రి నారా లోకేష్ నిరంతర పర్యవేక్షణతో నేపాల్ లో చిక్కుకున్న ఏపీ బాధితులకు భరోసా కల్పించారని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం సచివాలయం లోని పబ్లిసిటీ సెల్ విభాగంలో మంత్రులు నారా లోకేష్, అనిత లతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అనంతపురం లో జరిగిన సూపర్ సిక్స్- సూపర్ హిట్ పర్యటన రద్దు చేసుకొని రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ లో కూర్చుని నేపాల్ లో చిక్కుకున్న ఆంధ్రప్రదేశ్ పర్యాటకులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి లోకేష్ భరోసాని ఇచ్చారన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి అక్కడ చిక్కుకున్న బాధితులతో వ్యక్తిగతంగా మాట్లాడి ధైర్యం నింపారన్నారు. ఇలాంటి సందర్భాల్లో సాధారణంగా ఎవరైనా భయానికి, ఒత్తిడి కి, ఆందోళన కి లోనవుతారని, కానీ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన ధైర్యంతో వాళ్లంతా చాలా సంతోషం వ్యక్తం చేసినట్లు మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా తెలిపారు.

మిగతా 2లో...

## ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు..



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఉచిత బస్సు ప్రయాణం వల్ల తాము నష్టపోతున్నామంటూ ఆవేదన చెందుతున్న ఆటో డ్రైవరన్నలకు ఉపశమనం కల్పిస్తూ ప్రకటన చేసింది. దసరా నుంచి 'వాహన మిత్ర' అమలు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అనంతపురంలో నిర్వహించిన సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభలో ఆయన మాట్లాడారు. దసరా రోజున ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.

ఇటీవలే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందే. మిగతా 2లో...

# క్షేమంగా రప్పిస్తాం..

- నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత ప్రభుత్వానిది
- నేపాల్ లోని 12 ప్రాంతాల్లో చిక్కుకున్న 217 మంది తెలుగువారు
- మధ్యాహ్నం ఖాట్మండూ నుంచి ప్రత్యేక విమానం ద్వారా ఆంధ్రుల తరలింపు




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని రేపు సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని విద్య, ఐటీ, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఈ మేరకు సచివాలయం నాలుగో బ్లాక్ లోని పబ్లిసిటీ సెల్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. ఉదయం నుంచి సీఎం ఆదేశాల మేరకు నేపాల్ లో ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాం. అక్కడ తెలుగువారు ఎలా ఉన్నారు, వాళ్ల పరిస్థితి ఏంటి అని, తిరిగి వారిని ఆంధ్ర రాష్ట్రానికి తీసుకురావాలని చంద్రబాబు గారు మాకు చెప్పారు. ఉదయం నుంచి నేను ఆర్టీజీఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాం. హెూం మంత్రి అనిత, మంత్రి దుర్గేష్ అనంతపురం సభ నుంచి నేరుగా అమరావతికి వచ్చారు. మేం ముగ్గురం పరిస్థితిని మానిటరింగ్ చేశాం. ఏపీ భవన్ లో ఎమర్జెన్సీ సెల్ ఏర్పాటుచేసి ఒక సింగిల్ నెంబర్ ద్వారా తెలుగువారిని సంప్రదించాం. ఎవరైతే ఆ నంబర్ కు ఫోన్ చేశారో.. ఒక ట్రాకర్ మెయింటైన్ చేసి ప్రతి రెండు గంటలకు ఒకసారి పరిస్థితిని సమీక్షించాం. వారికి అందుతున్న ఆహారం, నీరు, విద్యుత్ సదుపాయాలపై రియల్ టైంలో ఆరా తీశాం.

**నేపాల్ లోని 12 ప్రాంతాల్లో చిక్కుకున్న 217 మంది తెలుగువారు**

ఢిల్లీలో ఉన్న కంట్రోల్ సెంటర్ ద్వారా టీడీపీ ఎంపీ సానా సతీష్, ఏపీ భవన్ అధికారి అర్జే శ్రీకాంత్ రియల్ టైంలో మానిటరింగ్ చేశారు. ఇప్పటికే మా దగ్గర ఉన్న సమాచారం ప్రకారం 217 మంది ఆంధ్రులు 12 ప్రాంతాల్లో చిక్కుకుని ఉన్నారు. వీరంతా హెూటళ్లలో కాని, వేరే పట్టణాల్లో కానీ ఉన్నారు. ఇందులో సుమారు 173 మంది ఖాట్మండూలో, 22 మంది హిటోడాలో, 10 మంది పోక్రాలో, 12 మంది సిమికోట్ లో ఉన్నారు. ఇది మేము టైం టూ టైమ్ మానిటరింగ్ చేస్తున్నాం. ఇందులో సుమారుగా 118 మంది మహిళలు, 98 మంది మగవారు ఉన్నారు. అటు ఏపీ భవన్, ఇటు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టైం టూ టైమ్ ఇటు ఎంబీసీతో, ఇతర అధికారులతో నిరంతరం సంప్రదింపులు చేశాం.

**నేడు ఖాట్మండూ నుంచి ప్రత్యేక విమానం ద్వారా తరలింపు**

ప్రధానంగా నేడు ఖాట్మండూ నుంచి ఆంధ్రులను తీసుకువచ్చేందుకు మధ్యాహ్నం ఏపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక విమానం ఖాట్మండూలో దిగి, అక్కడి నుంచి ఆంధ్రులు అందరినీ మొదటి హాల్ట్ విశాఖ, రెండో హాల్ట్ కడపకు తీసుకువస్తాం.

మిగతా 2లో...

# క్షేమంగా రప్పిస్తాం..



(మొదటి పేజీ తరువాయి)

ఖాట్మండూతో పాటు సిమికోట్ లో ఉన్న 12 మందిని ఉత్తర ప్రదేశ్ సరిహద్దులో ఉన్న నేపాల్ గంజ్ ఎయిర్ పోర్ట్ కు నేడు ఉదయం తరలిస్తాం. అక్కడి నుంచి రోడ్డుమార్గం ద్వారా వారు లక్నోకు వెళ్లి, అక్కడి నుంచి కమర్షియల్ ఫ్లైట్ ద్వారా తిరిగి వస్తారు. పోక్రాలో ఉన్న 10 మందిని రేపు ఉదయం ప్రత్యేక విమానం ద్వారా ఖాట్మండూకి తీసుకువచ్చి, అక్కడి నుంచి ఏపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన విమానం ద్వారా తిరిగి రాష్ట్రానికి వస్తారు. హిటోడాలో ఉన్న మరో 22 మంది రోడ్డు మార్గం ద్వారా బుధవారం రాత్రే బీహార్ సరిహద్దులోని రాక్సాల్ కు చేరుకున్నారు. వారికి కావాల్సిన ఇమ్మిగ్రేషన్ ఏర్పాట్లు కూడా చేశాం. వీరి సంరక్షణను ఏపీ భవన్ చూసుకుంటోంది.

**నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని నేడు సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత ప్రభుత్వానిది**

ఉదయం పది గంటలకు మేం తిరిగి సమావేశం అవుతాం. నేడు మొత్తం మానిటరింగ్ చేసి ప్రతి ఆంధ్రుడు తిరిగి వచ్చేంత వరకు పనిచేస్తాం. కేవలం విశాఖ, కడపకే కాదు.. ప్రభుత్వం అందరినీ వారి వారి నివాసాలకు చేర్చుతాం. విమానాశ్రయంలో కూడా వారికి కావాల్సిన వాహనాలు ఏర్పాటుచేసి నేరుగా వారిని ఇంటివద్దకే చేర్చుతాం. ఈ రోజు ఏపీ ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుని నేపాల్ లో చిక్కుకున్న ఆంధ్రులను తిరిగి తీసుకురావడం జరిగింది. మేం అందరం వాట్సాప్ గ్రూప్ కూడా ఏర్పాటుచేసుకున్నాం. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాం. ప్రతి రెండు గంటలకు ఒకసారి ముఖ్యమంత్రికి పరిస్థితిని వివరించాం. రేపు సాయంత్రం నాటికి అందరినీ క్షేమంగా ఇంటికి చేర్చే బాధ్యత ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుంది.

నేపాల్ లో చిక్కుకున్న వారు మొదట కొంత ఆందోళనతో ఉన్నారు. మేం మాట్లాడిన తర్వాత కుదురుకున్నారు. అక్కడ నెలకొన్న భయానక పరిస్థితులను వారంతా వివరించారు. ఏపీ నుంచి మేం 12 గ్రూప్ లతో నిరంతరం మాట్లాడుతూనే ఉన్నాం. ఏవైనా సమస్యలు ఉంటే మమల్ని సంప్రదించాలని చెప్పాం. ఆందోళన లేకుండా మేం చూసుకున్నాం. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడుతో కూడా దాదాపు 12 సార్లు మాట్లాడడం జరిగింది. కేబినెట్ భేటీకి ముందు కూడా సంప్రదించాను. భారతీయులను తీసుకువచ్చే బాధ్యత రామ్మోహన్ నాయుడు తీసుకున్నారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిలో ప్రధానంగా విశాఖ నుంచి 42 మంది, విజయనగరం నుంచి 34 మంది, కర్నూలు నుంచి 22 మంది ఉన్నారన్నారు.

# నేపాల్ లో చిక్కుకున్న ఏపీ బాధితులకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం నేపాల్ లో చిక్కుకున్న ఏపీ వాసులు అందర్నీ ఇండియాకి రప్పించే ఏర్పాట్లు చేస్తున్నామని, సాయంత్రానికి వారి వారి స్వస్థలాలకు పంపేలా అందరం చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఆటో డ్రైవర్లకు రూ. 15 వేలు..

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈ స్కీమ్ వల్ల తాము నష్టపోతున్నామని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. ఉచితంగా మహిళలంతా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని, తమకు బాడుగల లేక ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వాహన మిత్ర అమలు చేసి ఆర్థికంగా అండగా నిలబడాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు నాయుడు అనంతపురం సూపర్ సిక్స్.. సూపర్ హిట్ సభ వేదికగా ఆటో డ్రైవర్లకు తీపి కబురు అందించారు.

# నేపాల్‌లో చిక్కుకున్న కుటుంబాలను పరామర్శించిన చిల్లపల్లి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి లోకేష్ సూచనలతో, నేపాల్‌లో చిక్కుకున్న మంగళగిరి పట్టణ వాసుల కుటుంబసభ్యులను జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇంచార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావు స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా, నేపాల్‌లో చిక్కుకున్న బాధితులతో ఫోన్ ద్వారా మాట్లాడి, వారు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వారు సురక్షితంగా తిరిగిరావడానికి అన్ని విధాలుగా సహాయపడుతోందని హామీ ఇస్తూ, కుటుంబసభ్యులకు భరోసానిచ్చారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... ఈ ఉదయం నుంచి రాష్ట్ర సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి మంత్రి లోకేష్ సమక్షంలో, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నేతృత్వంలో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఖాట్మండు, సిమికోట్, పోఖారా ప్రాంతాల్లో చిక్కుకున్న తెలుగువారి పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయాలతో పాటు భారత విదేశాంగ శాఖతో సమన్వయం చేస్తున్నారు. ఖాట్మండు నుంచి విశాఖపట్నంకు ప్రత్యేక విమానం ద్వారా బాధితులను తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతరం, జిల్లా అధికారులు సమన్వయంతో బాధితులను తమ స్వస్థలాలకు చేర్చే చర్యలు లోకేష్ చొరవతో వేగవంతంగా కొనసాగుతున్నాయని చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

# ఫలించిన మంత్రి నారా లోకేష్ కృషి...

(మొదటి పేజీ తరువాయి)

అనంతపురం పర్యటనను రద్దుచేసుకున్న లోకేష్... ఉదయం 10గంటలకే హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారు. సచివాలయం ఫస్ట్ బ్లాక్ లోని ఆర్టీజీఎస్ వార్ రూమ్ కు చేరుకున్న లోకేష్... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తోపాటు సీనియర్ ఐఎఎస్ అధికారులు కార్తికేయ మిశ్రా, ముఖేష్ కుమార్ మీనా, కోన శశిధర్, అజయ్ జైన్, హిమాన్షు శుక్లా, జయలక్ష్మిలతో తదితరులతో సహాయ చర్యలపై చర్చించారు. ప్రస్తుతం ఖాట్మాండు విమానాశ్రయం మూసివేసి ఉన్నందున... ఎయిర్ పోర్టు ఓపెన్ చేసిన వెంటనే బాధితులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు భారత విదేశాంగశాఖ, నేపాల్ ఎంబసీ అధికారులతో నిరంతరం చర్చలు జరుపుతున్నారు. ఇప్పటివరకు 217మంది బాధితులు 12 గ్రూపులుగా వివిధ హోటళ్లలో తలదాచుకున్నట్లు గుర్తించారు. సిమిల్ కోట్ లో చిక్కుకున్న 12మంది బాధితులను పరిస్థితులు అనుకూలించిన వెంటనే లక్నో తరలించి, అక్కడినుంచి రాష్ట్రానికి రప్పించేలా ఏర్పాట్లు చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. బాధితుల్లో అత్యధికులు ఖాట్మాండు, పరిసరాల్లోని హోటళ్లలో ఉన్నందున ఖాట్మాండు నుంచి విశాఖపట్నానికి ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలవారీగా బాధితుల వివరాలను సేకరించి, వారిని



సురక్షితంగా స్వస్థలాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**బాధితులకు భరసా...** : నేపాల్ లోని వివిధ హోటళ్లలో తలదాచుకున్న బాధితులతో మంత్రి లోకేష్ వీడియో కాల్ మాట్లాడుతూ వారికి ధైర్యం చెబుతున్నారు. ప్రతి రెండుగంటలకు ఒకసారి వివిధ ప్రాంతాల్లో ఉన్న బాధితులతో మాట్లాడుతున్నారు. నేపాల్ లోని ముక్తినాథ్ యాత్రకు వెళ్లి చిక్కుకున్న విశాఖకు చెందిన సూర్యప్రభతో మంత్రి లోకేష్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఖాట్మాండులోని పశుపతినాథ్ టెంపుల్ సమీపంలోగల రాయల్ కుసుమ్ హోటల్ లో విశాఖకు చెందిన 84మంది తలదాచుకున్నారు. రోజారాణి అనే మహిళతో మాట్లాడిన లోకేష్... అధైర్య పడొద్దు... మిమ్మల్ని క్షేమంగా తీసుకొచ్చే బాధ్యత మాది అని భరోసా ఇచ్చారు. ఖాట్మాండులోని పశు పతి ఫ్రంట్ హోటల్ లో తలదాచుకున్న మంగళగిరికి మాచర్ల హేమ సుందర్ రావు, నాగలక్ష్మిలతో మంత్రి లోకేష్ వీడియో కాల్ లో మాట్లాడారు. మంగళగిరికి చెందిన 8మందితో పాటు ఆ హోటల్ లో మొత్తం 40మంది తలదాచుకున్నట్లు వారు తెలిపారు. నిన్న తాము ప్రయాణిస్తున్న బస్సుపై ఆందోళనకారులు హఠాత్తుగా దాడిచేశారని, తాము ప్రాణాలు అరచేతబట్టుకొని హోటల్ కు చేరుకున్నట్లు వారు చెప్పారు. తాము ఖాట్మాండు ఎయిర్ పోర్టుకు కేవలం కిలోమీటరు దూరంలోనే ఉన్నామని తెలిపారు. భయపడవద్దని... క్షేమంగా రాష్ట్రానికి తీసుకువస్తామని లోకేష్ భరోసా ఇచ్చారు. ఢిల్లీలోని ఏపి భవన్ సీనియర్ అధికారి అర్జా శ్రీకాంత్ తో సిఎంఓ అధికారి కార్తికేయ మిశ్రా బాధితులకు సహాయ చర్యలపై నిరంతరం సంప్రదిస్తున్నారు. మంత్రి లోకేష్ ఆదేశాలకు అనుగుణంగా ఏపిఎన్ఆర్ టి చైర్మన్ వేమూరి రవికుమార్, సిఇఓ కృష్ణమోహన్ సహాయచర్యలను సమన్వయం చేస్తున్నారు.

# రాష్ట్రాభివృద్ధి, ప్రజల భవిష్యత్తే కూటమి ప్రభుత్వ అజెండా





(మొదటి పేజీ తరువాయి)

అందుతుందని స్పష్టం చేశారు. సీఎం మాట్లాడుతూ.. "అకుంఠిత దీక్షతో రాష్ట్రం కోసం పనిచేస్తున్నాం. ప్రజలకు న్యాయం చేయాలి.. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలన్నదే నా ఆలోచన పవన్ కల్యాణ్ ఆలోచన.

ప్రజల భవిష్యత్తే మాకు ముఖ్యం. రాష్ట్రానికి మంచి చేయాలనే మా సంకల్పానికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. ప్రదాని నరేంద్ర మోదీ అన్ని విధాలలా అండగా ఉన్నారు.

ఈ సభా వేదికగా ప్రధాని మోదికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మూడు పార్టీల కార్యకర్తలు, నేతలకు ఒకమాట చెపుతున్నా...మీరంతా కాలర్ ఎగరేసుకుని తిరిగేలా పాలన అందిస్తున్నాం. మనం పాలకులం కాదు. సేవకులం..మనం పెత్తందారులం కాదు.. ప్రజల భవిష్యత్ కోసం పని చేసేవాళ్లం. అహంకారం, అవినీతి, అలసత్వం, అసంతృప్తి అనేది మన దరికి రానివ్వొద్దు. ఏ పొరపాటూ చేయొద్దు. జెండాలు మోసే మూడు పార్టీల కార్యకర్తలకు న్యాయం చేయడం మా బాధ్యత. ఐకమత్యంతో ఉండాలి...కలిసి ఉంటేనే మనకు బలం.

పీ4 కార్యక్రమంలో అంతా భాగస్వాములు అవ్వాలని కోరుతున్నా...సమాజానికి కొంత తిరిగిద్దాం. రామరాజ్యం లాంటి పాలన ఇచ్చే బాధ్యత నాది, పవన్ కళ్యాణ్, మాధవ్ ది.

నా దృష్టిలో సీఎం అంటే చీఫ్ మినిస్టర్ కాదు...కామన్ మాన్. ఎమ్మెల్యేలు కూడా కామన్ మ్యాన్ లా ఉండాలి. ఎన్నికలకంటే మన పరపతి పెరిగింది.. ఇది శాశ్వతంగా ఉండాలి. లి ఎమ్మెల్యే తప్పు చేసినా.. కార్యకర్త తప్పు చేసినా... అధికారి తప్పు చేసినా... ప్రభుత్వానికే చెడ్డ పేరు. కూటమి పాలనలో సంక్షేమం సూపర్ హిట్.. అభివృద్ధి సూపర్ హిట్. కలిసి పోటీ చేశాం. కలిసి గెలిచాం కలిసి పనిచేస్తాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**సంక్షేమం అంటే ఓట్ల రాజకీయం కాదు** : గత పాలకులు ఓట్ల కోసమే సంక్షేమం చేశారని.. సంక్షేమం అంటే తాత్కాలిక అవసరం తీర్చడం కాదని సీఎం అన్నారు. ఈ విజయోత్సవ సభకు కారణమైన స్త్రీశక్తికి వందనం, యువత పోరాటాలకు వందనం, అండగా నిలిచిన అన్నదాతకు వందనం, ప్రతి తల్లికీ వందనం, కార్యకర్తల కష్టానికి, త్యాగానికి వందనం అని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై మాట్లాడుతూ" బాధ్యత గల ప్రభుత్వంగా ఇచ్చిన మాటను నెరవేర్చిందని చెప్పడానికే ఇక్కడకు వచ్చాం. నేపాల్ ఆందోళనల్లో 200 మంది తెలుగు వారు చిక్కుకుపోయారు. మంత్రి నారా లోకేష్ ఆర్టీజీఎస్ నుంచి పర్యవేక్షిస్తున్నందున సభకు రాలేకపోయారు. తెలుగువారిని స్వస్థలాలకు తీసుకవచ్చేలా ఆయన బాధ్యత తీసుకున్నారు. అన్ని వర్గాలతో చర్చించి 2024 ఎన్నికల్లో సూపర్ సిక్స్ హామీలు తెచ్చాం. 2023, మే నెల 28న రాజమండ్రి మహానాడులో సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించాం. అదే సమయంలో కూటమి మేనిఫెస్టోతో ఎన్నికలకు వెళ్లి ప్రజా తీర్పు కోరాం. 2024 ఎన్నికలు చరిత్రను తిరగ రాశాయి. కనీ వినీ ఎరుగని రీతిలో 57 శాతం ఓట్ షేర్, 93 శాతం స్ట్రైక్ రేట్‌తో 164 అసెంబ్లీ సీట్లు గెలిపించారు. 21 లోక్‌సభ సీట్లు గెలుచుకున్నాం. ప్రతి పక్షానికి హోదా లేకుండా చేసిన మీకు అభినందనలు. గత ప్రభుత్వం ప్రజావేదిక కూల్చివేతతో పాలన మొదలు పెట్టి రాష్ట్రాన్ని అగాథంలోకి నెట్టివేసింది. రూ. 10 లక్షల కోట్ల అప్పులు, తప్పులు, పాపాలు, అక్రమాలు, వేధింపులు, దోపిడీలు, దౌర్జన్యాలు, మహిళలపై దురాగతాలు, అవినీతితో అంతటా అశాంతి, అభద్రత కలిగించారు. 93 కేంద్ర ప్రాయోజిత పథకాలు నిలిపివేశారు. నిరుద్యోగం, గంజాయి, డ్రగ్స్ తెచ్చిపెట్టారు. 15 నెలలుగా అనేక సవాళ్లను అధిగమించి ఒక్కో అడుగు వేస్తూ రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. నిర్వీర్యమైన వ్యవస్థలను సరిదిద్ది...మాట ఇచ్చినట్లు అన్ని పథకాలు అమలు చేస్తున్నాం. అందులో భాగంగానే పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలు మార్చే సూపర్ సిక్స్ అమలుచేశాం. అందరి సహకారంతో సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేసి మాట నిలబెట్టుకున్నాం. "అని ముఖ్యమంత్రి అన్నారు.

**సూపర్ సిక్స్ - బంపర్ హిట్:** "సూపర్ సిక్స్ అంటే హేళన చేశారు. పింఛన్ల పెంపు అంటే అసాధ్యం అన్నారు. పిల్లలందరికీ తల్లికి వందనం అంటే ట్రోల్ చేశారు. మెగా డీఎస్సీ అవ్వదన్నారు... దీపం వెలగదన్నారు... ఫ్రీ బస్సు కదలదన్నారు. ఇవన్నీ నిజం చేశాం. కోట్ల మంది లబ్ది పొందారు. ఏ వ్యక్తి జీవితాన్ని అయినా, ఏ కుటుంబ స్థితిగతులను అయినా మార్చేది చదువు. ప్రతి పేద బిడ్డా చదవాలని 'తల్లికి వందనం' తీసుకువచ్చాం. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా, పరిమితులు లేకుండా అందరికీ రూ. 15వేలు చొప్పున అందించాం. 67 లక్షల మంది విద్యార్థుల చదువులకు ఒకేసారి రూ. 10 వేల కోట్లు ఇచ్చాం. ఇది 10 వేల కోట్ల పథకం కాదు...మీ బిడ్డల బంగారు భవిష్యత్ కు ప్రభుత్వం పెడుతున్న పెట్టుబడి. తల్లుల నమ్మకాన్ని నిలబెట్టాం కాబట్టే 'తల్లికి వందనం' సూపర్ హిట్. నాడు బాబే మీ డ్రైవర్ అన్నాను. చెప్పినట్లు గానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. నా తెలుగింటి ఆడబిడ్డల సంతోషమే నా సంతోషం. ఉపాధి, వైద్యం, కాలేజీ, ఆలయం... ఎక్కడికైనా నా ఆడబిడ్డలు దర్జాగా వెళ్లి రావొచ్చు. ఇప్పటివరకు 5 కోట్ల మంది ఫ్రీ బస్సు ఎక్కారు. రూ. 175 కోట్ల మేర మహిళలకు ఆదా అయ్యింది. మీకు ఆర్థిక వెసులుబాటును, గౌరవాన్ని పెంచేందుకు తెచ్చిందే స్త్రీ శక్తి. ఫ్రీ బస్ జెట్ స్పీడుతో దూసుకెళ్తోంది కాబట్టే 'స్త్రీశక్తి' సూపర్ హిట్ అయ్యింది. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుంది. ఎన్డీఏ కూటమికి రైతే రాజు. మనకు అన్నంపెట్టేది అన్నదాత. రైతన్నకు అండగా ఉండేందుకే అన్నదాత సుఖీభవ పథకం తెచ్చాం. కేంద్రంతో కలిసి ఏడాదికి 3 విడతల్లో రూ. 20 వేలు ఇస్తామన్నాం. తొలి విడతగా ఇప్పటికే రూ. 7 వేలు ఇచ్చాం. 47 లక్షల మంది రైతులకు రూ. 3,173 కోట్లు జమ చేశాం. అనంతపురం రైతాంగానికి నీళ్లు అందాయి. ఏ రైతుకు యూరియా కొరత రానివ్వకుండా నేను బాధ్యత తీసుకుంటాను. కేంద్రం మన అవసరం మేరకు యూరియా అందిస్తోంది. ఆర్థిక కష్టాలున్నా...అండగా నిలిచాం కాబట్టే అన్నదాత సుఖీభవ సూపర్ హిట్ అయ్యింది. ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చి మహిళల వంటింటి కష్టాలు తీర్చాం. నేడు మళ్లీ దీపం-2 పథకం ద్వారా ఉచితంగా ఏటా 3 సిలిండర్లు ఇస్తున్నాం. ఇప్పటికే రూ. 1704 కోట్లు ఖర్చు చేసి... 2.45 కోట్ల ఉచిత సిలిండర్లు మహిళలకు ఇచ్చాం. ప్రతీ ఇంటా వెలుగులు నింపాం కాబట్టే... 'దీపం 2' సూపర్ హిట్ అయ్యింది. 20 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు ఏడాదిలోనే భర్తీ చేశాం. ఒక్క రూపాయి అవినీతి లేకుండా మెరిట్ ఆధారంగా ఇచ్చాం. యువత అండగా ఉంటే కొండలను బద్దలు కొడతాం. నైపుణ్య శిక్షణ ద్వారా 1 లక్ష మంది యువతకు ఉద్యోగాలు ఇచ్చాం. గత ప్రభుత్వం రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేస్తే.... మనం రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ఇది మన బ్రాండ్. యువత మేలుకోవాలి. మీ భవిష్యత్ ను బంగారు భవిష్యత్ చేసే బాధ్యత ప్రభుత్వానిది. యువత భవితకు భరోసా ఇచ్చాం కాబట్టే...యువగళం సూపర్ హిట్ అయ్యింది. అని సీఎం వ్యాఖ్యానించారు.

**పేదల జీవన ప్రమాణాలు పెంచేలా సంస్కరణలు:** "నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు ఐటీ ఉద్యోగిని తయారు చేశాం. దీంతో తలసరి ఆదాయం పెరిగి పేదరికం తగ్గింది. ఈసారి ప్రతీ ఇంటికో పారిశ్రామిక వేత్తను చూడాలనేది నా సంకల్పం. లక్షమంది డ్వాక్రా మహిళలను పారిశ్రామిక వేత్తలయ్యేలా ప్రోత్సహిస్తున్నాం. ఈ లక్ష్యం సాధిస్తాం. భారత దేశంలోనే అతి పెద్ద సంక్షేమ కార్యక్రమం మనం ఇస్తున్న 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు'. 'పేదల సేవలో' భాగంగా ప్రతీ నెలా 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఒక్క పింఛన్ల పంపిణీకే ఇప్పటి వరకు సుమారు రూ. 45 వేల కోట్లు ఖర్చు చేశాం. పేదవాడి ఆకలి తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లు పెట్టాం. వీటి ద్వారా ఇప్పటివరకు 5.60 కోట్ల భోజనాలతో కడుపు నింపాం. పేదలకు రూ. 5 కే భోజనం పెడితే ఇంతకంటే ఆనందం ఏముంది. గత ప్రభుత్వంలో పేదల పొట్ట కొట్టి అన్నా క్యాంటీన్లు మూసేశారు. కూటమి ప్రభుత్వం అందరి ప్రభుత్వం. అన్ని వర్గాల ప్రభుత్వం. అందరి జీవితాలు మార్చే ప్రభుత్వం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల జీవితాలను మార్చేలా సంస్కరణలు తెస్తున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కోట్ల మంది పేదల కొనుగోలు శక్తి పెంచుతుంది. పేదలను పైకి తీసుకురావాలని , ఆదాయం పెంచాలని ముందుకొచ్చాం. ఇదే స్ఫూర్తితో యూనివర్సల్ హెల్త్ స్కీం తెచ్చాం. దీంతో పేదల వైద్య ఖర్చులు తగ్గుతాయి. పేదలందరికీ రూ. 25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ కింద ఆర్థిక సాయం చేస్తాం. ప్రతి వ్యక్తి ఆరోగ్యయం కాపాడాలనే లక్ష్యంతో కొత్తగా సంజీవని ప్రాజెక్టు తెస్తున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు

**భూమి ఇస్తే మెడికల్ కాలేజీ ఉన్నట్టేనా** : రాష్ట్రంలో మెడికల్ కాలేజీ అంటే తెలియని నాయకుడు ఉన్నాడు. భూమి ఇస్తే మెడికల్ కాలేజీ పూర్తికాదు. రాష్ట్రంలో విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇచ్చాం. రాష్ట్రంలో మెడికల్ కాలేజీలు తెచ్చిన ప్రభుత్వం టీడీపీ. రాష్ట్రంలో 17 కాలేజీలు ఉంటే పాడేరులో ఒకటి మాత్రమే మొదలుపెట్టాం. మిగిలిన 16 అలాగే ఉన్నాయి. శంకుస్థాపన చేసి రిబ్బన్ కట్ చేస్తే కాలేజీలు నిర్మించినట్టేనా..అందుకే పీపీపీ విధానం తెచ్చాం. 2026-27 నాటికి 4 కాలేజీలు, 2027-2028 నాటికి 7 కాలేజీలు అందుబాటులోకి వస్తాయి. అసెంబ్లీకి రండి మొత్తం తెలిపోతుంది. టీడీపీకి వెన్నుముక బీసీ సోదరులు. బీసీల అభివృద్ధికి ఎన్డీఏ కట్టుబడి ఉంది. ఎస్సీ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన వర్గీకరణను ఎవరికీ నష్టం లేకుండా పూర్తి చేశాం. ఎస్టీల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. సామాజిక న్యాయం మా ధ్యేయం. వాట్సాప్ గవర్నెర్స్ ద్వారా 700 ప్రభుత్వ సేవలు పౌరులకు అందుబాటులోకి తెచ్చాం. డబుల్ ఇంజన్ సర్కార్ తో డబుల్ డిజిట్ గ్రోత్ . కేంద్రంలో, రాష్ట్రంలో మన ప్రభుత్వాలే ఉండటంతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2025-26 లో 10.5 శాతం జీఎస్ డీపీ గ్రోత్ రేటు వచ్చింది. ఆల్ ఇండియాలో 8.8 శాతం ఉంటే ఉండగా మనం 10.5 శాతానికి వచ్చాం. అదీ కూటమి ప్రభుత్వ సత్తా" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రప్పారప్పా అంటే ప్రజలు వారి బెండు తీశారు** : "సంక్షేమంలో కూటమి దూకుడుతో వైసీపీ ఉనికి కోల్పోతోంది. అందుకే ఫేక్ రాజకీయాలతో ప్రజలను మోసం చేయాలి చూస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డుతగులుతోంది. అసెంబ్లీకి రాకుండా పార్టీ ఆఫీసులు మూసుకుని....సోషల్ మీడియా ఆఫీసులు తెరిచారు. సిద్ధం సిద్ధం అని ఎగిరిపడిన వాళ్లను, అసెంబ్లీలో చర్చకు సిద్ధమా అంటే... కిక్కురుమనడం లేదు. రాజకీయాల్లో ఓనమాలు తెలియని వాళ్లు ప్రతిపక్ష హోదా కావాలంటున్నారు. ప్రతిపక్షహోదా, ముఖ్యమంత్రి పదవి ప్రజలిచ్చేవి అని వారికి తెలియదా . ప్రజలందరూ జగన్ రెడ్డికి క్లాస్ తీసుకోవాలి. శాసన సభకు రాకుండా రప్పా రప్పా అని రంకెలు వేస్తున్నారు. ఇక్కడుంది సీబీఎన్, పవన్ కల్యాణ్. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఆడబిడ్డలను అవమానిస్తే ఖబడ్దార్. అవమానిస్తే 5 నిమిషాల్లో పోలీసులు మీ చొక్కాలు పట్టుకుంటారు. ఆడబిడ్డలను అవమానించేవాళ్లను శిక్షించొద్దా? వీళ్ల తీరు మారలేదు కాబట్టే పులివెందుల, ఒంటిమిట్ట ఉప ఎన్నికల్లో బెండు తీశారు. ప్రజా స్వామ్యంలో హింసారాజకీయాలు చెల్లవు. వైసీపీ నాయకుడిది ధృతరాష్ట్ర కౌగలి. ఎవరైనా పొరపాటున ఫేక్ మాటలు నమ్మి దగ్గరికి వెళితే ధృతరాష్ట్ర కౌగిలికి బలి అవుతారు. చాలా జాగ్రత్తగా ఉండాలని చెపుతున్నా" అని ముఖ్యమంత్రి అన్నారు.

**సీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్** : హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులు తెలుగు దేశం హాయంలో వచ్చినవే. సీమ పల్లెల్లో ఫ్యాక్షన్ అంతం చేసినా...నీళ్లు తెచ్చినా ఆ ఘనత మనదే. సీమలో అన్ని చెరువుల్లోకి నీరు వస్తోంది. భవిష్యత్ లో 52 సీట్లు మనమే గెలవ బోతున్నాం. 15 నెలల పాలనతో సీమలో కూటమి మరింత బలపడింది. సాగునీటి ప్రాజెక్టులతో ఎడారి నేలకు జీవం పోశాం. కియా కార్ల పరిశ్రమ తెచ్చాం. అనంతను దేశంలో బ్రాండ్ చేశాం. నేడు మళ్లీ సీమ అభివృద్ధికి బ్లూ ప్రింట్ అమలు చేస్తున్నాం. రూ. 3850 కోట్లతో హంద్రీ నీవా ద్వారా కృష్ణమ్మను కుప్పం వరకు తీసుకువెళ్లాం. 5 ఏళ్లు వాళ్లు చేయలేని పనిని 100 రోజుల్లో చేశాం. మనం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులు నేటి ఆధునిక దేవాలయాలు. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలకళ తెచ్చాం. దీన్ని శాశ్వతం చేస్తాం. ఎవరు అడ్డుపడినా సీమ అభివృద్ధి ఆగదు. సూపర్ సిక్స్ సభ సూపర్ హిట్ చేసిన అనంతపురం జిల్లాకు ధన్యవాదాలు. జీడిపల్లి, భైరవానితిప్ప ఎత్తిపోతల పథకం, జీడిపల్లి, పేరూర ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఉరవకొండ, కల్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు నీరిచ్చేలా హంద్రినీవా 36 ఏబీసీ ప్యాకేజీలపై దృష్టి పెడతాం. మడకశిర బ్రాంచ్ కెనాల్ ఆధునీకరణపై దృష్టి పెడతాం" అని ముఖ్యమంత్రి తెలిపారు.









# నేపాల్ తాత్కాలిక సారథిగా సుశీలా కర్కీ?.. 'జెన్-జడ్' చర్చలు!



**నేపాల్:** కల్లోల నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాత్కాలిక సారథిని ఎన్నుకునేందుకు అక్కడి యువత ముమ్మర చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీ వైపు జెన్-జెడ్ ఉద్యమకారులు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. తాత్కాలిక సారథిగా బాధ్యతలు స్వీకరించేందుకు ఆమె కూడా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.
అవినీతికి వ్యతిరేకంగా నేపాల్‌లో కొనసాగుతున్న ఉద్యమం హింసాత్మక ఘటనలకు దారితీయడంతో ప్రధాని కేపీ శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. దీంతో కొత్త సారథిని ఎన్నుకునేందుకు జనరేషన్-జెడ్ ఉద్యమకారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దాదాపు 5వేల మంది బుధవారం వర్చువల్‌గా సమావేశమై మంతనాలు జరిపారు. కాఠ్‌మాండూ మేయర్ బాలెన్ షాను తొలుత పరిగణనలోకి తీసుకున్నప్పటికీ ఆయన నుంచి స్పందన రాలేదని తెలిసింది.
దీంతో మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కీ వైపు 'జెన్-జెడ్' ప్రతినిధులు మొగ్గుచూపినట్లు నేపాల్ మీడియా వెల్లడించింది. బాధ్యతలు స్వీకరించేందుకు కర్కీ సిద్ధమైతే.. తొలుత ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌తో భేటీ కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత అధ్యక్షుడు రామ్‌చంద్ర పౌడెల్ ఆమోదం పొందాల్సి ఉంటుందని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**ఎవరీ కర్కీ..?**
సుశీలా కర్కీ (72)కి నేపాల్ చరిత్రలో ప్రముఖ స్థానం ఉంది. తొలుత ఉపాధ్యాయురాలిగా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. నిర్భయంగా, సమర్థంగా విధులు నిర్వర్తిస్తూ అవినీతి మరకలేని వ్యక్తిగా పేరు సంపాదించుకున్నారు. 2009లో సుప్రీంకోర్టులో అడుగుపెట్టి.. శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2016లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టి.. నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు.

**25 మంది మృతి..**
నేపాల్‌లో గత రెండు రోజులుగా కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటివరకు ముగ్గురు పోలీసులు సహా 25 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరో 633 మంది గాయాలపాలైనట్లు తెలిపారు. ఆందోళనల్లో గాయపడిన నేపాలీ కాంగ్రెస్ చీఫ్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య, విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవ్‌బాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటున్నట్లు తెలిసింది. నేపాల్‌లో ఆందోళనలు అదుపులోకి రాకపోవడంతో సైన్యం నిరవధిక కర్ఫ్యూ విధించిన సంగతి తెలిసిందే.

## గత ఐదేళ్లలో ఇలా ఉండేదా ?



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** "గత ఐదేళ్లలో ఇలా ఉండేదా ? మా పాలనలో రైతులు రోడ్డెక్కడం చూశారా ? " అని వైసిపి అధినేత వైఎస్. జగన్ ప్రశ్నించారు. బుధవారం మీడియాతో జగన్ మాట్లాడుతూ %జా%. తమ హయాంలో రైతులకు ఇబ్బంది అనేదే లేదు అని చెప్పారు. ఇలాంటి పరిస్థితికి.. చంద్రబాబు సిగ్గుతో తలదించుకోవాలి అని విమర్శించారు. రెండు నెలలుగా రైతులు ఎరువులు దొరక్క అగచాట్లు పడుతున్నారని, పగలు రాత్రి తేడా లేకుండా క్యూలైన్లలో నిలబడ్డారని అన్నారు. సిఎం సొంత జిల్లా.. ఆయన నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి నెలకొందన్నారు. సమయానికి ఎరువులు అందిస్తే రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి దేనికి ? అని ప్రశ్నించారు. రైతులు యూరియా దొరక్క తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతులకు అందాల్సిన ఎరువులు బ్లాక్‌మార్కెట్‌లో స్కాంలకు గురవుతున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీనిని నిరసిస్తూ.. రైతుల పక్షాన రైతులతో కలిసి ఆర్డీవోలకు అర్జీలు ఇచ్చే కార్యక్రమం చేశామన్నారు. వైసిపి కార్యక్రమాన్ని అడ్డుకుంటూ.. పోలీసులు అణగదొక్కే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. వైసిపి నేతలకు ఎక్కడికక్కడే నోటీసులు ఇచ్చారని తెలిపారు. రైతులకు మద్దతు ఇవ్వడం తప్పా చంద్రబాబూ ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా ? అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస బాధ్యతలు నిర్వహించడం లేదు అని మండిపడ్డారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు అన్యాయం చేస్తున్నారని వైఎస్. జగన్ ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో ఇలా ఉండేదా ? మా పాలనలో రైతులు రోడ్డెక్కడం చూశారా ? అని జగన్ ప్రశ్నించారు.

## మహాలయ అమావాస్య నుంచే దసరా సెలవులు ప్రకటించాలి: ఆప్టా డిమాండ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విజయదశమి (దసరా) పండుగకు అనుగుణంగా మహాలయ అమావాస్య (సెప్టెంబర్ 22) నుంచే పాఠశాలలకు సెలవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డిమాండ్ చేసింది.
గతంలో రాష్ట్ర ప్రభుత్వం మహాలయ అమావాస్య నుండి దశమి వరకు సెలవులు ఇవ్వడం ఆనవాయితీగా ఉన్నప్పటికీ, ఈసారి కొత్తగా సెప్టెంబర్ 24వ తేదీ నుండి సెలవులు ప్రకటించారని సంఘం నాయకులు పేర్కొన్నారు. దీనిపై వారు మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ బాబు, పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, కమిషనర్లకు వ్రాతపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.
తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే మహాలయ అమావాస్య నుంచే సెలవులు ప్రకటించారని గుర్తు చేసిన ఆప్టా నేతలు, ఏపీ లో కూడా సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2 వరకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
"హిందువుల మనోభావాలను గౌరవించాలన్న ఉద్దేశంతో మహాలయ అమావాస్య నుంచే సెలవులు ప్రకటించాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం" అని ఆప్టా రాష్ట్ర అధ్యక్షులు ఎ. జి. ఎస్. గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రకాష్ రావు తెలిపారు.

## సిపిఎస్ ఉద్యోగులందరికీ డిఏ బకాయిలు చెల్లించాలి : పిఆర్టియు డిమాండ్



**విజయవాడ రూరల్,(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని సిపిఎస్ ఉద్యోగులందరికీ డిఏ బకాయిలు చెల్లించాలని పిఆర్టియు డిమాండ్ చేసింది. ఎన్టీఆర్ జిల్లా పిఆర్టియు వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్ మాట్లాడుతూ, ఇటీవలే కూటమి ప్రభుత్వం సచివాలయ సిపిఎస్ ఉద్యోగులకు డిఏ బకాయిలు చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఎల్లో ఒకటైన దసరా డీఏ చెల్లించాలని కోరారు.
రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల రమేష్ బాబు కలిసి విజయవాడ రూరల్ మండలంలో పిఆర్టియు సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంగ్లం, సోషల్ స్టడీస్ సిలబస్‌లో భారాన్ని తగ్గించాలని, దసరా సెలవులను సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 3 వరకు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు.
సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సీసీఎల్ ఇవ్వాలని, 12వ వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించి 30% మధ్యంతర భృతిని చెల్లించాలని కూడా కోరారు.
ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల నాయకులు పుండరీకాక్ష శర్మ, సుభాష్ చంద్రబోస్, సయ్యద్ యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్ అని ఏపీసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని ఆమె అన్నారు. హామీలు అమలు చేశామని అప్పుడే సక్సెస్ సభలు జరపడం హాస్యాస్పదమన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగ బిడ్డలు ఉంటే ఒక్కరికైనా 3 వేల నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ.. స్థాపించని పరిశ్రమలతో అగ్రిమెంట్లు చేసుకున్నంత మాత్రానా ఉద్యోగాలు ఇచ్చినట్లా ? అని అన్నారు. ఒక్కరికి భృతి ఇవ్వకుండా, ఒక్క ఉద్యోగం రాకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అయ్యిందని ధ్వజమెత్తారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 15 వందలు ఆర్థిక సహాయం అనేది సూపర్ సిక్స్ హామీ అని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో ఒక్క మహిళకైనా 15 వందలు ఇచ్చారా అని ఆగ్రహించారు.

## విజయవాడ డయేరియా బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ నగరంలోని న్యూ రాజరాజేశ్వరి పేట డయేరియా కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఆరా తీశారు.
డయేరియా బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశాను ఆదేశించారు.
మంత్రి ఆదేశించడంతో కలెక్టర్ లక్ష్మీశా విజయవాడ జిజిహెచ్ ను బుధవారం రాత్రి సందర్శించారు.
ఆర్ ఆర్ పేటకు చెందిన 18 మంది విజయవాడ జీజీహెచ్‌లో వాంతులు విరేచనాలతో చేరి ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకుంటున్నారని కలెక్టర్ లక్ష్మీశా మంత్రికి తెలిపారు. రంగు మారిన నీటిని సరఫరా చేస్తున్నారని బాధితులు కలెక్టర్ లక్ష్మీశా దృష్టికి తీసుకురావడంతో తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు.
బాధితులు వాంతులు విరేచనాలతో మంగవాళం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం మధ్య విజయవాడ జీజీహెచ్ లో చేరారు. ఓ వేడుక సందరంగా స్థానికులకు ఆహార పంపిణీ జరిగింది. ఆసుపత్రిలో చికిత్సకోసం చేరిన వారిలో కొంతమంది వేడుక సందర్భంగా తీసుకున్న ఆహారం అనంతరం వాంతులు, విరేచనా ల బారిన పడినట్లు వైద్యులకు తెలిపారు. ఆర్ ఆర్ పేటలోనే ఓ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎవి రావు మాట్లాడుతూ ఆసుపత్రిలో చేరిన వారి నుంచి సేకరించిన రక్త, మలమూత్రాల నమూనాలను పరీక్ష చేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు అందిన 8 మల నమూనాల ఫలితాలు నెగటివ్‌గానే వచ్చాయని చెప్పారు. మరోవైపు సత్యనారాయణపురానికి చెందిన ఓ మధ్య వయస్కురాలు దీర్ఘకాల వ్యాధులతో ఆసుపత్రిలో మంగళవారం మరణించారని చెప్పారు. ఈ మరణం కేసుకు న్యూ రాజరాజేశ్వరిపేట డయేరియా ఘటనకు ఎటువంటి సంబంధంలేదని స్పష్టం చేశారు.

## ఎమ్మెల్యే ఆనందబాబు జన్మదినవేడుకలు



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు జన్మదిన వేడుకలను తెలుగుదేశం శ్రేణులు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని తెనాలి, వేమూరు నియోజక వర్గాల కార్యాలయంలొ బుధవారం సాయంత్రం, మాజీమంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు జన్మదినోత్సవ వేడుకలను, పార్టీ శ్రేణులు ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. ఈక్రమంలొ అభిమానులు ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ కేక్ ను, ఎమ్మెల్యే ఆనందబాబు పార్టీ శ్రేణుల నడుమ కట్ చేసి, అభిమానులతొ తమ ఆనందాన్ని పంచుకున్నారు. పార్టీలోని పలువురు నాయకులు, ఆనందబాబును దుశ్శాలువలతొ సత్కరించి, ఆనందబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షులు మహ్మద్ కుద్దూస్ మీడియాతొ మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి, విద్యార్థి నాయకుడిగా, శాసనసభ్యుడిగా, మంత్రిగా పార్టీకి, ప్రజలకు, విలువైన సేవలు అందిస్తున్న, ఆనంద్ బాబు నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలడుగు సురేంద్ర, అత్తోట శ్యామ్, మహిళా నాయకులు, జొన్నాదుల మహేష్, హెచ్ సి వి, సంస్థ చైర్మన్ కరణం వెంకటేశ్వరరావు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, పసుపులేటి మూర్తులు, నలుకుర్తి రమేష్, సుంకర హరికృష్ణ, పలువురు వార్డు కౌన్సిలర్లు, పార్టీలోని వివిధ స్థాయి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి - టెక్కలి టిడిపి




**టెక్కలి, (జర్నలిస్ట్ ఫైల్) :** యూరియా సరఫరాపై వైసీపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను వెంటనే ఆపాలని టెక్కలి టిడిపి నాయకులు హెచ్చరించారు. టెక్కలి టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, నందిగాం మండల అధ్యక్షులు పినకాన అజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి రాము మాట్లాడుతూ రైతులకు యూరియా అందడం లేదని అపోహ కలిగించే ఉద్దేశంతో వైసీపీ నాయకులు నిన్న ర్యాలీ నిర్వహించారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర పౌరవిమానాయన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సహకారంతో యూరియాను తగిన మోతాదులో రైతులకు అందజేస్తున్నారని చెప్పారు.
కొంతమంది రైతులు ఒకేసారి మూడు ట్రిప్పులకు సరిపడే యూరియా తీసుకోవడం వల్ల తాత్కాలిక సమస్య తలెత్తిందని, అయితే వ్యవసాయ శాఖ మంత్రి తక్షణ చర్యలు తీసుకొని రైతు సేవా కేంద్రాలు, ఎరువుల దుకాణాల ద్వారా యూరియాను సరఫరా చేశారని వివరించారు. ఇకపై రైతులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా యూరియా సమృద్ధిగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి రైతు సంక్షేమం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం నిజమైన రైతు ప్రభుత్వం అని, ఇకనైనా పెడాడ తిలక్, వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మట్ట పురుషోత్తం, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖ రావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, బసవల అప్పలస్వామి, రెయ్యి ప్రీతీష్‌చంద్ర, పొన్నాడ రాజారావు, పంగ వసంత్, పేర మురళి, సోదిముడి కిరణ్, ప్రఫుల్ల పరిడ, చల్ల అప్పన్న, పంగ మన్మధ్‌రావు, బమ్మిడి మురళి, పొట్నూరు చిరంజీవి తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేపాల్ జైళ్ల నుంచి 7,000 మంది ఖైదీలు పరారీ!



**నేపాల్:** యువత నిరసనలు నేపాల్ లో హింసాత్మక పరిస్థితులకు దారితీశాయి. ఈ క్రమంలోనే కల్లోల పరిస్థితులను అదనుగా చేసుకుని దేశంలోని ఆయా జైళ్ల నుంచి దాదాపు ఏడు వేల మంది ఖైదీలు పరారయ్యారు. నౌబస్తాలోని ఓ బాల సదనంలో భద్రతాబలగాలతో జరిగిన ఘర్షణల్లో ఐదుగురు మైనర్లు మృతి చెందారు. భద్రతాసిబ్బంది నుంచి ఆయుధాలు లాక్కుని పరారయ్యేందుకు యత్నించారని, ఈ క్రమంలో సిబ్బంది జరిపిన కాల్పుల్లో వారు ప్రాణాలు కోల్పోయారని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి.
"జైళ్లలో నిప్పుపెట్టి, భద్రతా సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి దేశవ్యాప్తంగా (%చీవజూఖశ్రీ%) ఆయా జైళ్ల నుంచి దాదాపు 7,000 మంది ఖైదీలు పరారయ్యారు. రాజ్‌బిరాజ్, ఝుంప్కా, దిల్లీబజార్, చిట్వాన్, నక్కూ, కైలాలీ, జాలేశ్వర్ తదితర జైళ్ల నుంచి వేల మంది తప్పించుకున్నారు. నౌబస్తా బాలసదనం నుంచి 76 మంది మైనర్లు పరారయ్యారు. ఈ పరిణామాలతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఖైదీల నుంచి ప్రాణభయంతో అనేక మంది బాధితులు ఇళ్లు వీడుతున్నారు" అని నేపాల్ మీడియా కథనాలు తెలిపాయి.
సింధూలిగఢీ జైల్లో ఖైదీలు నిప్పు పెట్టారని, అనంతరం అక్కడి నుంచి 43 మంది మహిళలు సహా మొత్తం 471 మంది పరారయ్యారని అధికారులు తెలిపారు. నవాల్‌పరాసీ వెస్ట్ జిల్లా కారాగారం నుంచి 500 మంది తప్పించుకున్నారు. దిల్లీబజార్ కారాగారం నుంచి తప్పించుకునేందుకు యత్నించిన ఓ ఖైదీని స్థానికులు పట్టుకుని సైన్యానికి అప్పగించారు. భారత్- నేపాల్ సరిహద్దులో ఉత్తర్‌ప్రదేశ్‌లోని సిద్ధార్థనగర్ జిల్లాలోకి చొరబడేందుకు యత్నించిన ఐదుగురు ఖైదీలను సశస్త్ర సీమాబల్ అదుపులోకి తీసుకుంది.

**తెరుచుకున్న కాఠ్‌మాండూ ఎయిర్‌పోర్ట్..**
ఉద్రిక్తతల నేపథ్యంలో కాఠ్‌మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసి ఉంచిన విషయం తెలిసిందే. నేటి సాయంత్రం నుంచి కార్యకలాపాలను పునఃప్రారంభించినట్లు అధికారులు ప్రకటించారు. దేశంలో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు నేపాల్ ఆర్మీ ఇప్పటికే రంగంలోకి దిగింది. కర్ఫ్యూ ప్రకటించింది. మరోవైపు, దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ నిరసనకారుల బృందంతో సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో యువ ఆందోళనకారులు తమ డిమాండ్లను వెల్లడించారు. రాజ్యాంగాన్ని తిరిగిరాయాలన్నారు.

## రెండోసారి తితిదే ఈవోగా అవకాశం.. పూర్వజన్మ సుకృతం

**తిరుమల (జర్నలిస్ట్ ఫైల్) :** తితిదే ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన అలిపిరి మార్గంలో కాలినడకన తిరుమల చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ఈవోగా ప్రమాణం చేశారు. రంగనాయకుల మండపంలో ఆయనకు వేద పండితులు ఆశీర్వచనాలిచ్చారు. అనిల్ సింఘాల్‌కు అదనపు ఈవో వెంకయ్య చౌదరి శేషవస్త్రం కప్పి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ.. రెండోసారి ఈవోగా అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి అవకాశం రావడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు. కాలినడక మార్గంలో వస్తున్నప్పుడు భక్తులు కొన్ని సమస్యలు దృష్టికి తెచ్చారని తెలిపారు. వాటిని పరిష్కరించి మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తిరుమల పవిత్రతను కాపాడాలని చంద్రబాబు తనకు సూచించారన్నారు. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారని తెలిపారు.
బదిలీ అయిన తితిదే పూర్వ ఈవో శ్యామలరావుకు ఆలయ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్యామలరావు మాట్లాడుతూ.. పూర్వ జన్మ సుకృతం ఉంటే తప్ప తితిదే ఈవోగా పనిచేసే భాగ్యం కలగదన్నారు. తనకు ఈవోగా పనిచేసే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 14 నెలల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు చెప్పారు. రాబోయే 25 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా సంస్కరణలు, అభివృద్ధి చేపట్టినట్లు వివరించారు. బోర్డు సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

## పంచాయితీరాజ్ టీచర్ల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి!

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పంచాయతీరాజ్ యాజమాన్యంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పనిచేస్తున్న క్రమంలో మరణించినటువంటి కుటుంబ సభ్యులలో ఒకరికి కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కు ప్రాతినిధ్యం చేసినట్లు ఏపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. హృదయ రాజు ఎస్. చిరంజీవి తెలియజేశారు.
రాష్ట్రంలో పంచాయతీరాజ్ యాజమాన్యంలో పనిచేస్తూ కరోనా మరియు సహజ మరణాలు జరిగిన కుటుంబసభ్యులలో ఒకరికి కారుణ్య నియామల క్రింద ఉద్యోగం కల్పించాల్సి ఉండగా గత ఐదు సంవత్సరముల నుండి దాదాపు 1000 కేసులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వీరికి వన్ టైం సెటిల్మెంట్ కింద ఉద్యోగాలు కల్పించాలని మరియు కేవలం పంచాయతీరాజ్ శాఖలోని ఖాళీలను మాత్రమే చూడకుండా అన్ని శాఖలలోని ఖాళీలను పరిగణలోకి తీసుకొని ఉద్యోగాలు కల్పించాలని సెక్రటేరియట్ లో పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శిని కోరడం జరిగింది. అదేవిధంగా ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలలో మ్యూచువల్, స్పౌజ్ కేటగిరీలలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ బదిలీ అవకాశం కల్పించాలని పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ గారికి ప్రాతినిధ్యం చేశారు. విద్యాశాఖ స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారిని ఆయా జిల్లాల్లో ఉన్న ఖాళీల సంఖ్యను బట్టి అవకాశం కల్పిస్తామని తెలిపారని స్పౌజ్ క్యాటగిరీ ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారని, ఇది సరైన విధానం కాదని ధరఖాస్తు చేసుకున్న ప్రతి స్పౌజ్ క్యాటగిరికి ఇతర జిల్లాలకు బదిలీ పై వెళ్ళుటకు అవకాశం కల్పించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేసింది.
అదేవిధంగా దసరా సెలవులను సెప్టెంబర్ 24 నుండి కాకుండా మహాలయ అమావాస్య ప్రారంభం అనగా సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 3వరకు దసరా సెలవులను ఇవ్వాలని కూడా పాఠశాల విద్య కార్యదర్శి గారికి ప్రాతినిధ్యం చేసినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తెలియజేశారు

## ఇవిఎంలతో స్థానిక ఎన్నికలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** స్థానిక సంస్థల ఎన్నికలు ఇవిఎంలతో నిర్వహించే అంశం ప్రభుత్వంతో సంప్రదిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనరు నీలం సహాని తెలిపారు. విజయవాడ బందరు రోడ్డులోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఆమెను కలిసిన మీడియా ప్రతినిధులతో కొద్ది సేపు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను నాలుగు దశల్లో నిర్వహించేందుకు వీలుగా కసరత్తు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. 16నుంచి నవంబరు 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాల్సి ఉంటుంది. నవంబరు 1నుంచి 15వ తేదీలోగా ఎన్నికల అధికారులు నియామక ప్రక్రియ పూర్తి చేయాలి. నవంబరు 16నుంచి 30లోగా పోలింగ్ తేదీలు ఖరారుతో పాటు ఇవిఎంలు సిద్ధంచేయడం వంటివి చేయాల్సి ఉంటుంది. డిసెంబరు 15లోగా రిజర్వేషన్లు ఖరారు, అదే నెల చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి 2026 జనవరిలో నోటిఫికేషన్ జారీ చేసి అదే నెలలో ఫలితాలు ప్రకటించాల్సి ఉంటుందని సహాని పేర్కొన్నారు.



మంగళవారం జరిగిన ధర్నాలో నినాదాలు చేస్తున్న వైశ్య వికాస వేదిక నేతలు

## స్థానిక సంస్థల్లో వైశ్యుల రాజకీయ వాటా తేల్చాలి

### వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ గుప్తా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల రాజకీయ వాటా తేల్చాలని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వైశ్యుల ఆత్మగౌరవం, హక్కుల సాధనకై వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సాధన దీక్ష చేపట్టారు. ఈ ధర్నానుద్దేసించి సత్య నారాయణగుప్తా మాట్లాడుతూ వైశ్యులు పేరుకే అగ్రవర్ణాలుగా కీర్తించ బడుతున్నారు కానీ రాజకీయంగా అస్పృశ్యులుగా మిగిలిపోతున్నారని ఆవే దన వ్యక్తం చేశారు. కార్పోరేట్‌లు, మార్వాడి వ్యాపారాల వల్ల పేద వైశ్యుల వ్యాపారాలు నిర్వీర్యం అవుతున్నాయని, వారిని ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వేలో వైశ్యుల జనాభా శాతాన్ని అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు వైశ్యుల జనాభా దామాషా ప్రకారం 500 సర్పంచులు, 250 ఎంపీటీసీ, 30 ఎంపీపీ, 30 జెడ్‌పీటీసీ, 200 కౌన్సిలర్లు, 40 కార్పోరేటర్‌లు, ఒక జడ్‌పీ ఛైర్మన్, ఒక మేయర్, 15 మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య కార్పోరేషన్‌కు వంద కోట్ల రూపాయల నిధులను కేటాయించాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాలలో వైశ్యులకు జనాభా ప్రకారం వాటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దీక్షా కార్యక్రమంలో రాష్ట్రీయ లోక్ దళ్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ముక్కా సాంబశివ రావు, వైశ్య వికాస వేదిక ట్రస్ట్ సభ్యులు నంగునూరు రమేష్, రామ్‌నరేష్, కాచం ఏక్‌సాయి, కొత్త రవి, కొడుమూరు దయాకర్, శేఖర్, గిరీష్, బొక్క ఈశ్వరయ్య,సంఘంనాయకులు శ్యాం, పూర్ణచందర్, పశుపతిగుప్తా, ప్రభు గుప్తా, రంగా రవీందర్‌గుప్తా, నేలాంటి మధు మరియు వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన వైశ్య నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా రైతులు

## పలు పంటలపై మహిళా రైతులకు శిక్షణ

### తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తల సూచనలు

**అత్తాపూర్ సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ముల్కనూరు సహకార గ్రామీణ పరపతి,మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంలో హన్మకొండ జిల్లా కామ భీమదేవరపల్లి మండలంకు చెందిన ముల్కనూరు ముత్తారం, గట్ల నర్సింగాపురం కొత్తపల్లి, భీమదేవరపల్లి గ్రామాలకు చెందిన 55 మంది మహిళా రైతులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం రాజేంద్రనగర్‌లోని ఉద్యాన కళాశాల నందు నిర్వహించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైనటువంటి పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, గొర్రెలు మేకలు పెంపకం గురించి నిపుణులతో శిక్షణఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన విద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత కుమారి, జోనల్ రిసార్చ్ హెడ్, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ వెంకట రమేష్ మరియు ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుంకరి నరేష్

## తప్పుడు ఆరోపణలు చేస్తున్న హైడ్రా కమిషనర్: సుంకరి

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుట్రపూరితంగా సామాజిక మాధ్యమాల్లో మీడియాను తప్పుతోవ పట్టిస్తూ చట్ట వ్యతిరేకంగా తనపై ఆరోపణలు చేయిస్తున్నారని హైకోర్టు న్యాయవాది సుంకరి నరేష్ ఆరోపించారు. వర్టెక్స్ హోమ్స్ అధినేత రియల్టర్ వర్మతో హైడ్రా కమిషనర్ కుమ్మక్కైయి తనపై తప్పుడు కేసులు పెట్టారని ఆయన చెప్పారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను ఫెక్ సర్టిఫికేట్లు పెట్టానని, బార్ కౌన్సిల్ తనని సస్పెండ్ చేసిందని ఆయన పత్రికల్లో ప్రకటనలు ఇప్పించారన్నారు. తుక్కుగూడలో తన క్లయింట్ హనుమూన్ సినీమా నిర్మాత చైతన్యరెడ్డికి చెందిన 7ఎకరాల 10గుంటల స్థలంలో కొంత భాగాన్ని వర్మ అక్రమించి రోడ్డు వేయడం జరిగిందని, ఈ విషయం ప్రచారం కావడంతో దీన్ని జీర్ణించుకోలేని వర్మ ల్యాండ్ సెటిల్‌మెంట్ కోసం తాను చైతన్య రెడ్డిని 50లక్షలు డిమాండ్ చేశానని కమిషనర్ ఎసిపితో ఫిర్యాదు చేయించినట్లు ఆయన ఆరోపించారు. చైతన్యరెడ్డి అజ్ఞాతంలో ఉన్నారని, ఆమె బయటకు వస్తే నిజాలు బయటపడతాయని, రంగనాథ్ నుంచి తనకు ప్రాణహాని ఉందని నరేష్ చెప్పారు.

## లోపభూయిష్టంగా లైసెన్డ్స్ సర్వేయర్ల పరీక్షలు,శిక్షణ

### తెలంగాణ రాష్ట్ర లైసెన్డ్ సర్వేయర్స్ సంక్షేమ సంఘం

**హైదరాబాద్, సెప్టెంబరు10(జర్నలిస్ట్‌ఫైల్):** లైసెన్స్ సర్వేయర్‌కు నిర్వహించిన శిక్షణ, పరీక్షలు పూర్తిగా లోపభుయిష్టంగా ఉందని తెలంగాణ రాష్ట్ర లైసెన్స్ సర్వేయర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నగరా రమేశ్ అన్నారు. ఈమేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్స్ శిక్షణ, పరీక్షల కోసం నోటిఫికేషన్ విడుదల చేసి తమ వద్ద రూ 10వేల వరకు ఫీజులు రూపంలో తీసుకున్నారని, స్పెల్ 1లో 7వేలు, స్పెల్ 2లో 3034 మందిని ఎంపిక చేశారన్నారు. తెలంగాణ అకాడమి ఆఫ్ ల్యాండ్ ఇన్ఫార్మేషన్ అండ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో అన్ని వసతులు, ఉపకరణాలతో శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, కనీస వసతులు, ట్రైనర్లు, ఫీల్డ్ ప్రాక్టికల్స్ లేకుండానే నిర్వహించారని దీంతో సొంత మెటీరియల్ తెచ్చుకొని చదువుకోవాల్సి వచ్చిందన్నారు. దీంతో ఉత్తీర్ణత శాతం 30 కంటేతక్కువగా వచ్చిందని, ఈ అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు10(జర్నలిస్ట్‌ఫైల్):** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారంనిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 311దరఖాస్తులుఅందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖకు 76దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు 50దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 85దరఖాస్తులు,ప్రవాసీ ప్రజావాణికి 3దరఖాస్తులు,ఇతర శాఖలకు సంబంధించి 97దరఖాస్తులుఅందినట్లు అధికారులు తెలియజేసారు. ఈ సందర్భంగా సీఎం ప్రజావాణీ ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి. చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణా రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు,మరియూ హాస్టల్స్‌లో సుమారు 3070మంది డైలీవేజెస్ ,కాంటినిజెంట్ ,పార్ట్‌టైమ్,తదితర పేర్లతో గత 35సంవత్సరాలుగా పనిచేస్తున్న వారందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ కార్మికులు వినతి పత్రం సమర్పించారు.

## జర్మన్, జపనీస్ భాషలు నేర్పించేందుకు ఇఫ్లూతో ఎంఒయు

### మంత్రి దామోదర సమక్షంలో ఒప్పందం చేసుకున్న ఆరోగ్యశాఖ





**హైదరాబాద్, ప్రభాతవార్త, (జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషలు నేర్పించేందుకు ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ)తో వైద్య, ఆరోగ్య శాఖ అవవగాహన ఒప్పందం చేసుకుంది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ సమక్షంలో ఇఫ్లూతో ఆరోగ్యశాఖ ఎంవోయు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ నర్సింగ్ అనేది ప్రజల ప్రాణాలు కాపాడే పవిత్రమైన వృత్తి అన్నారు. ఇది ఇతరుల పట్ల దయ, ప్రేమ చూపించగలిగే వారు మాత్రమే చేయగల పని అన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో కుటుంబ సభ్యులే పేషెంట్లకు దూరంగా ఉన్నారని నర్సులే వారికి కుటుంబ సభ్యులై సేవలందించారని, వారి ప్రాణాలను పణంగా పెట్టి, పేషెంట్ల ప్రాణాలను కాపాడారని తెలిపారు. అలాంటి పవిత్ర వృత్తిలోకి వెళ్లేందుకు సిద్ధమైతున్న నర్సింగ్ స్టూడెంట్స్ అందరికీ అభినందనలు తెలిపారు మంత్రి, నర్సులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో తమ ప్రభుత్వం నిబద్ధతో ముందుకెళ్తుందని, గతేదాది సుమారు 7వేల నర్సింగ్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి తెలిపారు. ఈ ఏడాది మరో 2322 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోం దన్నారు. ఇదేకాకుండా దేశ, విదేశాల్లో నర్సులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జర్మన్,జపాన్ దేశాల్లో నర్సులకు చాలా డిమాండ్ ఉందని, మన నర్సుల్లో మంచి స్కిల్ ఉన్నప్పటికీ జర్మన్, జపాన్ లాంగ్వేజేస్ రాకపోవడం వల్ల ఆయా దేశాల్లో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని మంత్రి చెప్పారు. జర్మన్, జపాన్ వంటి విదేశీ భాషలు నేర్పించి వారికి అక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పిం చడానికి మంగళవారం ఇఫ్లూ యూనివర్సిటీతో ఒప్పందంచేసుకున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. నర్సింగ్ స్టూడెంట్స్‌కు వర్చువల్‌గా, నేరుగా రెండేళ్లపాటు విదేశీ భాషల్లో ఇఫ్లూ ట్రైనింగ్ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తుం దన్నారు. ఆయా దేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఈ ట్రైనింగ్ వారికి తోడ్పడుతుందని మంత్రి తెలిపారు. మన నర్సులు విదేశాల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలుచేస్తే, వారి కుటుంబాలు ఆర్థికంగా,సామాజికంగా నిలదొక్కుకుంటాయన్నారు.

## నిర్లక్ష్యానికి 3 నిండు ప్రాణాలు బలి

### సంపులో నీరుతోడేందుకు దిగిన కార్మికులు

### శ్వాస ఆడక ముగ్గురి మృతి

### ఒకరి పరిస్థితి విషమం

### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విషాదం



**చర్ల,సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** మిషన్ భగీరథ అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని ఉంజుపల్లి గ్రామంలో పెను విషాదం జరిగింది. పూసుగుప్ప పంచాయతీ పరిధిలోని ఉంజుపల్లి వద్దిపేట పూసుగుప్ప గిరిజన గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేం దుకు మిషన్ భగీరథ పథకం (గ్రిడ్) ఆధ్వర్యంలో రూ.35 లక్షల అంచనా వ్యయంతో సంపు పంపు హౌస్ నిర్మాణ పనులకు చేపట్టి పూర్తికావచ్చాయి. ఈ క్రమంలో సంపులో ఉన్న నీటిని తోడేందుకు మోటర్ అమర్చేందుకు అక్కడ పనిచేస్తున్న కార్మికుడు అందులోకి దిగారు. అకస్మాత్తుగా శ్వాస కోస సంభందిత ఇబ్బందులు తలెత్తడంతో కార్మికుడు ఇబ్బంది పడి కేకలు వేయడంతో అతన్ని రక్షించేదుకు మరో కార్మికుడు దిగాడు. ఇలా ఒకరి తర్వాత మరొఇద్దరు వారిని రక్షించేందుకు అప్రక్రమించి నలుగురు ఊపిరి ఆడకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారిని రక్షించేందుకు గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టిన తోటి కార్మికుల ప్రయత్నాలు విఫలం అయ్యాయి. సహాయక చర్యల కోసం పోలీస్ వైద్యశాల టోల్ ఫ్రీ నెంబర్లకు ప్రయత్నించారు. అంతలో గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఉంజుపల్లి బయలుదేరి రక్షణ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సిఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్.ఐలు నర్సిరెడ్డి కేశవ్ తమ సిబ్బందితో సంపులో చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు శ్రమించారు. సిఐ రాజువర్మ మరో కానిస్టేబుల్ మిగిలిన కార్మికుల సహాయంతో సంపులోకి దిగి ఒక్కొక్కరిని బయటకు తీసి అంబులెన్స్ సహాయంతో హుటాహుటిన చర్ల సిహెచ్ సీ కి తరలించి ప్రాధమిక వైద్య చికిత్సలు అందించిన ఫలితం దక్కలేదు. అప్పటికే కాక మహేస్ (ఉంజుపల్లి) నీలం తులసిరామ్( లింగా పురం) ఇద్దరు కార్మికులు మృతిచెందరు. మరో ఇద్దరు కార్మికులు అనసూరి అప్పలరాజు తడిగడ పల ఇస్సాకుల పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. వారిని మెరుగైన వైద్యం కోసం భద్రాచలం వైద్య శాలకు తరలించే క్రమంలో ఇస్సాన్ అనే కార్మికుడు మృతిచెందడం విశేషం. ఆనసూరి అప్పలరాజును భద్రాచలం తరలించారు. ఈ ఘటన పై నలినీ ప్రభాతవార్త వివరణ కోరగాసంపులోని నీటిని తోడేందుకు అనేక మార్గాలు ఉన్న ఈ విధంగా వ్యవహారించడం వలనే ప్రమాదం జరిగిందన్నారు. రూ.20లక్షల నష్టపరిహారం ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని బాధితకుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేసారు.

## ఎల్ఆర్ఎస్‌కు రూ.5లక్షలు డిమాండ్

### రూ.4.లక్షలు తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ్డ నార్సింగి టిపిఒ మణిహారిక



పట్టుబడ్డ నార్సింగి టిపిఓ మణిహారిక. వివరాలు వెల్లడిస్తున్న ఎసిబి డిఎస్‌పి గంగసాని శ్రీధర్, బాధితుడు వినోద్

**నార్సింగి, సెప్టెంబరు (జర్నలిస్ట్‌ఫైల్):** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలోని నార్సింగి మున్సిపల్ టిపిఒ మణిహారిక రూ.4.లక్షలు తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడింది. హైదరాబాద్ సిటీ అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి గంగసాని శ్రీధర్ తన సిబ్బందితో కలిసి మంగళ వారం నార్సింగి మున్సిపల్ కార్యాలయంపై దాడి చేసి టిపిఒ. మణిహారికను అదుపులోకి తీసుకొని, బాధితుడి లంచంగా ఇచ్చి రూ.4.లక్షలను సీజ్ చేసి కార్యాలయంలో ఉన్న డాక్యుమెంట్లన్నింటిని పరిశీలించారు. అదే సమయంలో మణిహారిక ఉంటున్న అల్కాపూరిలోని ఆమె ఇంటిపై కూడ దాడి చేసిసోదాలు జరిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి గంగసాని శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల గ్రామానికి చెందిన వినోద్ వారం రోజుల క్రితం నార్సింగి టిపిఒ మణిహారిక లంచం అడుగుతుందని ఫిర్యాదు చేశారు. వినోద్ తన 500గజాల స్థలానికి చెందిన ఎల్ఆర్ఎస్ సర్టిఫికెట్ క్లియరెన్స్ చేసేందుకు నార్సింగి టిపిఒ. మణి హారికను కలిశాడు. ఈ పని చేసేందుకు ఆమె తనను రూ.5.లక్షలు డిమాండ్ చేస్తుందని మా దృష్టికి తీసుకు వచ్చాడు. వినోద్-టిపిఒల మధ్య 4,50,000లకు బేరం కుదిరింది. ఇందులో మంగళవారం రూ.4.లక్షలు వినోద్ నార్సింగి మున్సిపల్ కార్యాలయంలోని టిపిఒ మణిహారికకు అందజేశాడు. వెంటనే మేము వెళ్లి ఆమెను, ఆమె తీసుకున్న డబ్బులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామని డిఎస్‌పి శ్రీధర్ వివరించారు.

## కాళేశ్వరం అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలి

### ఆదిలాబాద్ బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్





**హైదరాబాద్, సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సిబిఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్ డిమాడ్ చేశారు. ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించకపోతే జిఓ సవరణపై సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టిపిసిసి చీఫ్‌గా ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్షకోట్ల అవినీతి జరిగినట్లు మాట్లాడారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో దోషులను శిక్షిస్తామని, హవాలా మార్గం ద్వారా విదేశాలకు తరలించిన వేల కోట్ల రూపాయలను తిరిగి రప్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 90 రోజుల్లో ఏమీ జరగలేదన్నారు. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసిన తర్వాత కాళేశ్వరంలో జరిగిన అవినీతిని బయటకు తీయలేదని, ఒకవైపు ఘోష్ కమిటీని ఏర్పాటు చేసినా, మరోవైపు మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారంలోని బ్యారేజీలకు బుంగలు పడ్డాయి. నేషనల్ డ్యామ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధిత సమాచారం కూడా ఇవ్వకుండా, వారి సలహాలు పట్టించుకోకుండా వ్యవహరించారు. ఒక కేసు మీద ఇన్వెస్టిగేషన్ ప్రారంభించినప్పుడు సంబంధిత ఆధారాలను చెడగొట్టడం ప్రథమ నేరమని, ఘోష్ కమిషన్ ఏర్పడిన తర్వాత మూడు బ్యారేజీల్లో ఆధారాలు లేకుండా రిపేర్లు చేయించారని ఎన్‌డిఎస్‌ఏ క్లియర్‌గా పేర్కొన్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చెప్పేది ఒకటి చేసేది మరొక్కటి అన్నారు. లక్షకోట్లకుపైగా అవినీతి జరిగిందని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విలువ రూ. 12 వేల కోట్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. మిగతా లక్షల కోట్లకి సంబంధించి స్పష్టత చెప్పలేదని, పదుల సంఖ్యలో బ్యారేజీలు, వందల సబ్ స్టేషన్లు, పంపుహౌస్‌లు అనేక అంశాల్లో అవినీతి జరిగిందని కాంగ్రెస్ పార్టీ చెప్పింది. ఈ అంశాలపై సిబిఐ విచారణ జరగలేని విధంగా జిఓ. జారీ చేశారు. కాంగ్రెస్‌పార్టీ బిఆర్ఎస్‌ను కాపాడే ప్రయత్నంలో భాగంగా మూడు బ్యారేజీలపై మాత్రమే విచారణకు అప్పగిస్తూ జిఓ ఇచ్చారు. జిఓలో టర్మ్స్ అండ్ రిఫరెన్స్‌ను ఎందుకు చేర్చలేక పోతున్నారని ప్రశ్నించారు. టెండర్లు లేకుండా ఇచ్చిన వేలకోట్ల రూపాయల విలువ కలిగిన కాంట్రాక్టులు, నాణ్యత లేకుండా పనులు చేసిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఎందుకు మెన్షన్ చేయలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, కేవలం రాజకీయ లబ్ధిపొందే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తున్నదని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అన్ని అవినీతి అంశాలపై సిబిఐ పూర్తి విచారణ జరగాలంటే జిఓలో సవరణ తప్పనిసరి. లేదంటే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు అయినట్లే అని భావించాల్సి వస్తుందన్నారు.

## పెండింగ్ బిల్లులు చెల్లించండి

### అమరవీరుల స్తూపానికి నివాళర్పించి నిరసన తెలిపిన మాజీ సర్పంచ్‌ల జెఏసి

**హైదరాబాద్,సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** తెలంగాణ పంచాయతీరాజ్ మంత్రి పదవికి గౌరవం దక్కేలాగా గ్రామ పంచాయతీలకు అభివృద్ధికీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌ల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఘన్ పార్కులోని అమర వీరులు స్థూపానికి నివాళర్పించి తమ నిరసన తెలిపింది. సిఎం రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేసి గ్రామాభి వృద్ధికి తోడ్పడాలని జేఏసి సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ డిమాండ్ చేశారు.ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలుతున్నా గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడం గాంధీ మహాత్ముడి కలైనగ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడిచే విధంగా కాంగ్రెస్‌పాలన ఉందన్నారు. దేశంలోనే ఇక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామ అభివృద్ధి చేసిన సర్పంచులుపెండింగ్ బిల్లులురాకపోవడంతో అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వం హత్యలే అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు సకాలంలో వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మ హత్య చేసుకునే పరిస్థితిలో ఉన్నారు అదేవిధంగా పంచాయతీ సెక్రెటరీ మా బిల్లులు చెల్లించాలి అని వాళ్లు కూడా మొరపెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. బిల్లులు చెల్లించాలని అడుగుతే అరెస్టులతో భయపెట్టించడం ఇదే నా ప్రజా ప్రభుత్వం ?ఇదే నా ప్రజా పాలనాని ఆయన నిలదీశారు. అధికారంలోకి రాక ముందుకు ఒక మాట అధికారంలోకి వచ్చినంక మరొక మాట మాట్లాడడం ఈ పాలకుల మాటలు కాదన్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ శాఖకు నిధులు ఇచ్చి పంచాయతీరాజ్ శాఖకు గౌరవం దక్కించాలన్నారు. ఇప్పటికే గ్రామాలు అపరిశుభ్రత పేరుకుపోయి అంటువ్యాధులు విజృంబించే పరిస్థితులు ఉన్నాయని,గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య అంజయ్యగౌడ్,సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టు జాతీయ ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి

**హైదరాబాద్, సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** మావోయిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా తెలంగాణకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ నియమితులయ్యారు. ఈ పదవిలో వున్న నంబాల కేశవరావు ఊరఫ్ బసవ రాజు అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో ఆ స్థానం ఖాళీగా వుండడం తెలిసిందే. ఆయన స్థానంలో ఎవరిని నియమిస్తారనే దానిపై కొన్ని నెలలుగా ఉత్కంఠ నెలకొనగా దీనికి ఆ పార్టీ మంగళవారం తెరదించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన తిప్పిరి దళిత సామాజికవర్గానికి చెందిన వారు. 1980లో దుబాయ్‌లో ఉద్యోగం చేయగా 1984లో నక్సలిజంవైపు మళ్లి బస్తర్ ఉద్యమంలో వెళ్లారు. ఈ సమయంలో రాడికల్స్ యూనియన్‌లో చేరారు. ఎస్ఆర్ఆర్ కాలేజి పూర్వ విద్యార్థి అయిన తిరుపతి మావోయిస్టు పార్టీ అగ్రనేత గణపతికి ప్రియ శిష్యుడుగా పేరొందారు. చంద్రబాబు నాయుడుపై అలిపిరి వద్ద జరిగిన దాడికి స్కెచ్ వేసిన నలుగురు మావోయిస్టు అగ్రనాయకుల్లో తిరుపతి కూడా ఒకరు.

## హరీష్‌రావు మానసిక పరిస్థితి బాగోలేదు

### భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు10(జర్నలిస్ట్‌ఫైల్):** హరీష్ రావు మానసిక పరిస్థితి సరిగా లేక గ్రూప్ 1 విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అడ్డగోలుగా కామెంట్స్ చేస్తున్నారని భువనగిరి కాంగ్రెస్‌ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియమకాల పేరుతో తెచ్చుకున్న రాష్ట్రం మనది పదేండ్ల కాలంలో మీరు అధికారంలో వుండి ఏం చేశారు ప్రశ్నించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోసం చేసింది మీరుకాదా అని అడిగారు. డిఎస్‌సి, గ్రూప్1,2,4పరీక్షలు పెట్టని మీరు ఈ రోజు మాట్లాడుతున్నారా అని నిలదీశారు. టిజిపిఎస్‌సి పరీక్ష పేపర్లు అమ్ముకుంది మీరు కాదా అని ఆరోపించారు. జిరాక్స్ సెంటర్ల వద్ద, పల్లిబటానిలకు పరీక్ష పేపర్లు అమ్ముకోలేదా దరిద్రపు పాలన చేసింది మీరు కాదా హరీష్ రావు అని ఆయన ధ్వజమెత్తారు. హైకోర్టు తీసుకున్న నిర్ణయం ఎంటీ రీవాల్యుయేషన్ చేయ్యాలంది. అది వీలు కాకుంటే మళ్లీ పరీక్ష నిర్వహించమని చెప్పింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకుం టది. మీకు ఓట్లు వేయనందుకు నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా అడ్డు పడుతున్నారని ఆరోపించారు.

## చర్లపల్లి డ్రగ్ తయారీపై ఎక్సైజ్‌తో విచారణ

### సీజ్‌చేసిన బెల్లం రైతులకు విక్రయించే అంశంపై పరిశీలిస్తాం

### మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్,సెప్టెంబరు10(జర్నలిస్ట్‌ఫైల్):** చర్లపల్లిలోని డ్రగ్స్ తయారీ ఫ్యాక్టరీ కేసులో విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చాం నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్,పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించి అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని విన్నపాలు అధికంగా వచ్చాయని ఆయన వివరితంచారు. ధరణి సమస్యలు , పాస్ పుస్తకాల ఇష్యూ పై ఎక్కువ దరఖాస్తులు రాగా వాటిని ఆయా పరిధిలోని అధికారులను చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశామని తెలిపారు. సీజ్ చేసిన నల్లబెల్లాన్ని రైతులకు తక్కువ ధరకు కేటాయించాలని రైతు కమిషన్ ఛైర్మన్ కొదండరెడ్డి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందించారు. రైతు కమిషన్ ప్రతిపాదనకు ఎక్సైజ్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఛైర్మన్ కొదండరెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కమిషన్ సభ్యులు భూమి సునీల్ తోపాటు కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్, కమిషన్ అధికారి హరివెంకట ప్రసాద్, ఆదర్శ రైతు కోటిరెడ్డి వున్నారు.

## గ్రూప్-1 పోస్టుల కుంభకోణంపై సిబిఐచే విచారణ జరిపించాలి: పాడి కౌశిక్‌రెడ్డి

**(జర్నలిస్ట్‌ఫైల్)ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,సెప్టెంబరు** గ్రూప్ 1 పోస్టుల కుంభకోణంపై సిబిఐ విచారణ జరిపించాలని బిఆర్ఎస్ ఎంఎల్ఏ పాడి కౌశికొరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సిఎం రేవంత్ రెడ్డిపై సిబిఐ విచారణను కోరాలని అన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి గ్రూప్ 1 పోస్టులను అమ్ముకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. సిఎంఓ ఆఫీసు నుంచి గ్రూప్1 పోస్టులు అమ్ముకున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో అక్రమాలు జరి గాయని కోర్టుకూడా చెప్పిందని గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం బిఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రూప్1 విషయంలో హైకోర్టు ఇచ్చినతీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని పేర్కొన్నారు. గ్రూప్1 మెయిన్స్ విషయంలో తప్పులు జరిగాయని హైకోర్టు నమ్మిందని,మెయిన్స్ రీ వాల్యుయేషన్ లేదా రీఎగ్జామ్ పెట్టాలని హైకోర్టు చెప్పిందని తెలిపారు.

## గురుకుల సమస్యలను పరిష్కరించాలి

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి విజ్ఞప్తి

**హైదరాబాద్, (జర్నలిస్ట్‌ఫైల్) సెప్టెంబరు 10:** రాష్ట్రంలోని వివిధ గురుకులాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని నల్గొండ-వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురుకుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కి ఆయన నివాసంలో కలిసి గురుకుల పాఠశాలల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. సమావేశంలో గురుకుల పాఠశాలల బాధ్యులు దిలీప్ రెడ్డి, నర్సయ్య, ప్రభాకర్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌పాల్గొన్నారు. స్పందించిన మంత్రి గురుకుల సమస్యల పరిష్కారానికి హామీఇచ్చినట్టు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.

## పోలీసు నియామక మండలికి హైకోర్టు మొట్టికాయ

### దళిత యువతి ఎనిమిదేళ్ల పోరాటం ఫలించిన వైనం

**హైదరాబాద్, సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్ర పోలీసు నియామక మండలి ఒంటెద్దు పోకడల కారణంగా ఎనిమిదేళ్ల పాటు న్యాయ పోరాటం చేసి న దళిత యువతికి ఎట్టకేలకు న్యాయం దక్కింది. కానిస్టేబుల్ పోస్టుకు నగరంలోని గౌలిగూడకు చెందిన సంగీత 2017లో సాయుధ బలగంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యింది. అయితే అనేక కారణాలతో పోలీసు నియామక మండలి ఆమెను ఎంపిక చేయలేదు. దీనిపై ఆ యువతి ఎనిమిదేళ్ల పా టు హైకోర్టులో పోరాడగా ఆమెకు వెంటనే కానిస్టేబుల్ ఉద్యోగం ఇవ్వాలని ఉన్నత న్యాయస్థానం సర్కారును ఆదేశించింది. వాస్తవానికి గత మార్చి లోనే సింగిల్ బెంచ్ ఆమె నియామకానికి ఆదేశాలు ఇచ్చినా సర్కారు దీనిని సవాల్ చేసింది. దీనిపై విచారించిన చీఫ్ జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడినధర్మాసనం సింగిల్ బెంచ్ ఉత్తర్వులను సమర్థించింది. సంగీతకు స్థానిక దళిత కోటాలో ఏఆర్ కానిస్టేబుల్ ఉద్యోగం ఇవ్వాలనిధర్మాసనం ఆదేశించింది. పోలీసు నియామక మండలి గతంలోనూ అనేక మందికి ఇలా అన్యాయం చేయగా వారు న్యాయస్థానా ల్లో పోరాడి ఉద్యోగాలు పొందారు.

## టాలివుడ్ ప్రముఖులను బెదిరిస్తున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ అరెస్టు

**హైదరాబాద్,సెప్టెంబరు 10(జర్నలిస్ట్‌ఫైల్):** టాలీవుడ్ సినీ ప్రముఖులపై బెదిరింపులకు పాల్పడిన ఓ కానిస్టేబుల్ ను పోలీసులు అరెస్టు చేశారు. గత కొద్ది రోజులుగా డ్రగ్స్ కేసులో ఇరికిస్తానంటూ ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు సినీ ప్రముఖులను వేధింపులకు గురిచేస్తున్నాడు. పలువురు సినీ ప్రముఖుల ఇంటికి వెళ్ళి..డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, లేదంటే ఇంట్లో డ్రగ్స్ దొరికాయని కేసు పెడతానని వేధిస్తున్నాడు. తాను పోలీస్ ఇన్స్పెక్టర్ అంటూ చెప్పుకొని వేధింపులకు పాల్పడుతుండటంతో భరించలేక హైదరాబాద్ పోలీసులకు సినీ ప్రముఖులు ఫిర్యాదు చేశారు. దీంతో ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావును అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారిస్తున్నారు.

## డా. కొల్లూరికి మరో అరుదైన గౌరవం

- భారతదేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్ఠాత్మక అవార్డ్ కు ఎంపిక
- కరోనా కష్టకాలంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించిన డా. కొల్లూరికి తగిన గుర్తింపు



**పెడన, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు, సమాజ సేవకులు, ప్రజా సేవకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) పెడన పట్టణ పరిసర ప్రాంత కరోనా బాధితులకు, ప్రజలకు అందించిన విశిష్ట సేవలకు అత్యున్నత గౌరవ పురస్కారం లభించింది. విశాఖపట్టణానికి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ 37వ వార్షికోత్సవం విశాఖరత్న కళాపరిషత్ 27వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ ఒరిస్సా రాష్ట్రాలలో వివిధ రంగాలలో ప్రతిభావంతులను గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. దీనిలో భాగంగా దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖరత్న కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పిఏ భాస్కరరావు కరోనా కష్టకాలంలో ప్రజలకు విశిష్ట సేవలు అందించిన డా. కొల్లూరి ని భారతదేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డ్ కు ఎంపిక చేయడం జరిగింది. విశాఖపట్టణానికి చెందిన దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ విశాఖరత్న కళాపరిషత్ సంస్థల సంయుక్తా ఆధ్వర్యంలో ఈనెల 14న ఆదివారం విశాఖపట్నం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నందు నిర్వహించు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డా. కొల్లూరి భారతదేశ ప్రథమ రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ జాతీయ సేవా పురస్కారం ప్రతిష్టాత్మక అవార్డ్ అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు డా. కొల్లూరి కి అభినందనలు తెలియజేశారు.

## జిల్లాలో సజావుగా ఎరువుల సరఫరా

- ఎక్కడా యూరియా కొరత లేదు
- రైతులు అవసరం మేరకే ఎరువులు వినియోగించాలి
- నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**జి.కొండూరు, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

జిల్లాలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, ముఖ్యమంత్రి సూచనల మేరకు ఎరువుల పంపిణీ జరుగుతోందని.. ఎక్కడా యూరియా కొరత లేదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ.. జి.కొండూరులో పర్యటించారు. మండలంలో ఎరువుల పంపిణీ స్థితిగతులను పరిశీలించారు. రైతులతో ముచ్చటించి, పంటల దశల వారీగా వినియోగించాల్సిన మోతాదుపై అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా నానో యూరియాను పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని.. రైతులు అవసరం మేరకు యూరియా, ఇతర ఎరువులను వినియోగించాలని, ఈ విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సూచనలను పాటించాలని సూచించారు. గత మూడు రోజులుగా ఎరువులపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నామని.. సమీప సొసైటీలో ఎరువుల నిల్వలు, వచ్చే వారం రోజుల్లో కొత్తగా వచ్చే ఎరువుల పరిమాణం, నానో యూరియా ప్రయోజనాలు, యూరియాను ఏ దఫా ఎంత వేయాలి.. తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 32 డ్రోన్ల ద్వారా నానో యూరియా స్ప్రేయింగ్ డెమో నిర్వహిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నిరంతరం ఎరువుల రవాణా, సరఫరాపై పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతులకు ఎరువులను అందిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## రాజధానిలో మేఘా సంస్థకు రూ.713 కోట్ల ప్రాజెక్టు

**అమరావతి, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

అమరావతిలోని పరిపాలన నగరంలో రోడ్లు, డ్రెయిన్‌లు, నీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థలు వంటి మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టు పనుల్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది. ఆ ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.682.26 కోట్లు కాగా, 4.55 శాతం ఎక్కువ మొత్తాని(రూ.713.31కోట్లు)కి కోట్ చేసి ఎల్1గా నిలిచిన మేఘా సంస్థను సీఆర్‌డీఏ ఎంపిక చేసింది. ఏడేళ్లపాటు నిర్వహణ బాధ్యత కూడా ఆ సంస్థదేనని తెలిపింది. ఈ మేరకు మేఘా సంస్థకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ జారీ చేసేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అధికారమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆటిజం మీ పిల్లల జీవితంలోకి ప్రవేశించకముందే దాన్ని అడ్డుకోండి

- ఆటిస్టిక్ పిల్లలలో గట్-బ్రెయిన్ యాక్సిస్‌ను పరిష్కరించే ఒక ప్రధాన చికిత్స ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ థెరపీని అందించే భారతదేశంలో మొట్టమొదటి సంస్థ రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్
- రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ ఈ నెల 14 న విజయవాడలోని ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో ఆటిజం సమస్య ఎదుర్కొంటున్న బాలల కోసం ఉచిత శిబిరం
- రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి



**విజయవాడ, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆటిజం గర్భం నుంచే మొదలవుతుంది. ఆటిజం మీ పిల్లల జీవితంలోకి ప్రవేశించకముందే దాన్ని అడ్డుకోండి" అని రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి సూచించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి నెలకొల్పిన హైదరాబాద్‌లోని రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్, ఆటిజం, ఇతర నాడీ సంబంధిత పరిస్థితుల నిర్వహణకు సమగ్ర విధానాన్ని అందించే భారతదేశంలో మొట్టమొదటి చికిత్స కేంద్రం. రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆటిజం, న్యూరో డెవలప్‌మెంట్ పరిస్థితులు, జీర్ణశయాంతర రుగ్మతలు, పోస్ట్ కీమో గట్ రికవరీ సవాళ్లకు ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ , మల్టీ-ఓమిక్స్ ఆధారిత పర్సనలైజ్ చికిత్సలను అందించడంలో తనదైన ప్రత్యేకతను కలిగి ఉంది. రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ భారతదేశంలో మొట్టమొదటిసారిగా ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ (ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ ని అనేక ఆధునిక రుగ్మతలకు కేంద్రంగా ఉన్న గట్-మెదడు అక్షాన్ని పరిష్కరించేందుకు ప్రధాన చికిత్సగా అందిస్తోంది. ఆటిజం సమస్యను పరిష్కరించేందుకు ఈ కొత్త ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స గురించి అవగాహన కల్పించేందుకు, గట్ సమస్యలతో బాధపడుతున్న పిల్లలకు సహాయం చేసేందుకు రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ సెప్టెంబరు 14, 2025న ఐకాన్ పబ్లిక్ స్కూల్, ఏలూరు రోడ్, సీతారాంపురం, విజయవాడ - 520 002లో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 6.00 గంటల వరకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ప్రకటించింది. రిజిస్ట్రేషన్ల కోసం, దయచేసి భవానీని 91000 65552 నంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేయించుకోవలసి ఉంటుంది. ఈ సందర్భంగా రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ ప్రయాణం, ఏర్పాటు గురించి రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి మాట్లాడుతూ, "ఒక తల్లిగా, నా బిడ్డ కోసం నేను ఏదైనా చేస్తానని నాకు తెలుసు. నేను వృత్తిరీత్యా కార్డియాలజిస్ట్‌ని. నా కుమార్తె 2015లో జన్మించింది. ఒక ఏడాది అనంతరం ఆమెకు ఆటిజం ఉన్నట్లు నిర్ధారణ అయింది. ఈలోగా, ఆమెకు తీవ్రమైన గట్ ఆరోగ్య సమస్యలు ఉన్నాయని గుర్తించాము. ఆమె గట్ సమస్యలకు పరిష్కారం కనుగొనే ఈ ప్రయాణం 2017లో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్న పిల్లలలో గట్ మైక్రోబయోమ్ పాత్రను అర్థం చేసుకోవడానికి, దానికి చికిత్స చేయడం వల్ల ఆటిస్టిక్ పిల్లల ప్రవర్తనా లక్షణాలు, మొత్తం జీవన నాణ్యత మెరుగుపడుతుందా అని అర్థం చేసుకోవడానికి నన్ను పరిశోధనా మార్గంలోకి నడిపించింది" అని గతాన్ని గుర్తు చేసుకున్నారు. "లోతైన వ్యక్తిగత అనుభవంతో కొనసాగుతున్న వారి ప్రస్తుత లక్ష్యం ఆటిజం సంరక్షణ చికిత్స విధానాలలో మార్పు తీసుకురావడం ప్రధానంగా ఉంది. ఫిబ్రవరి 2022లో ప్రారంభించిన ఐసిఎం ఆర్ ఆమోదించిన మూడేళ్ల అధ్యయనం ఇప్పుడు దాదాపు పూర్తి దశకు చేరుకుం టోంది - ఒకటి పిండం దశలోనే చికిత్స చేయడం ద్వారా ఆటిజం నివారణ కాగా, మరొకటి ఆటిజాన్ని నిర్వహించడానికి మల మైక్రోబయోటా మార్పిడి చికిత్స. గట్-బ్రెయిన్ సైన్స్‌లో ట్రైల్‌బ్లేజర్‌గా మారిన కార్డియాలజిస్ట్ డాక్టర్ చంద్రశేఖర్ తోడుపునూరి ఆటిజం లేని తరం కోసం మహిళలు టాక్సిన్ లేని గర్భధారణను పొందడంలో సహాయపడే ప్రధాన లక్ష్యం తో ఈ రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్‌ను నెలకొల్పారు. తన సొంత బిడ్డ ఆటిజం, గట్ పనిచేయకపోవడం, అలెర్జీలతో బాధపడుతుండటం చూసిన తర్వాత, సాంప్రదాయ వైద్యం తరచుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన మూల కారణాలను డీకోడ్ చేసే లక్ష్యాన్ని ఆయన ప్రారం భించారు. డాక్టర్ చంద్రశేఖర్ తోడుపునూరి పరిశోధన పని రెండు ప్రధాన ఆవిష్కరణలకు దారితీసింది. ఆటిజం ఉన్న పిల్లలు, గట్ సమస్యలు ఉన్న పెద్దలు మరియు కీమోథెరపీ నుంచి కోలుకుంటున్న క్యాన్సర్ రోగులకు కూడా ఫలితాలను మెరుగుపరచడానికి గట్ మైక్రోబయోమ్ ట్రాన్స్‌ప్లాం టేషన్ (ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాం టేషన్ మరియు డీటాక్స్ ఆధారిత హీలింగ్ ప్రోటోకాల్‌లు. జననానికి ముందు ఆటిజం, ఇతర బాహ్య జన్యుపరంగా ప్రభావితమైన రుగ్మతలను నివారించేందుకు ఒక చురుకైన సాధనంగా తల్లి మరియు పర్యావరణ మార్పు. ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స గురించి డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి మాట్లాడుతూ, "మలబద్ధకం, ఉబ్బరం లేదా ఆహార జీర్ణం కాకపోవడం, సరిపోడకపోవడం చాలా మంది ఆటిస్టిక్ పిల్లలు ఎదుర్కొనే జీర్ణ సమస్యలలో ఉన్నాయి. కొత్త గట్ బ్రెయిన్ పరిశోధన ప్రకారం, మన కడుపులోని బ్యాక్టీరియా మెదడుకు సంకేతాలను పంపడం ద్వారా ప్రవర్తన, నిద్ర విధానాలు, అభ్యాసాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు, సరైన అధ్యయనాల అనంతరం, రెస్‌ప్లైస్ ఇన్‌స్టిట్యూట్ ఒక కొత్త చికిత్స ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ ని కనుగొంది. ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ అనేది ఒక వైద్య ప్రక్రియ. దీనిలో దాత మలం నుంచి ఆరోగ్యకరమైన గట్ బాక్టీరియాను రోగి జీర్ణవ్యవస్థలోకి బదిలీ చేసి సమతుల్య గట్ మైక్రోబయోమ్‌ను పునరుద్ధరించబడుతుంది. ఇది కొన్ని గట్-సంబంధిత పరిస్థితులకు చికిత్స చేసేందుకు వినియోగిస్తుండగా, నాడీ మరియు జీవక్రియ రుగ్మతలలో దాని మెరుగైన ప్రయోజనాల కోసం ఉపయోగించబడుతోంది. పరిశోధన ప్రకారం, గట్ మైక్రోబయోటా మెదడు కార్యకలాపాలు, జీవక్రియ, రోగనిరోధక శక్తి, భావోద్వేగ ప్రవర్తననూ నియంత్రిస్తుంది. ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ డైస్బయోసిస్ లేదా గట్ అసమతుల్యతను పరిష్కరిస్తుంది. ఇది నాడీ, జీర్ణ రుగ్మతలకు మూల కారణం. ఏఎస్‌డీ ఉన్న పిల్లలలో మంటను నియంత్రించడంలో సహాయపడే తక్కువ మేలు చేసే బ్యాక్టీరియాతో పాటు చెడును కలిగించేవి కూడా ఎక్కువగా ఉంటాయి. ఈ చెడు బ్యాక్టీరియా ఆటిజం లక్షణాలను మరింత దిగజార్చే పదార్థాలను ఉత్పత్తి చేస్తుంది. అక్కడే ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరం అవుతుంది. "సాధారణంగా పునరావృతమయ్యే సి డిఫిసిల్ కొలిటిస్ చికిత్సకు ఉపయోగిస్తారు, ఇది తీవ్రమైన జీర్ణ సమస్యలను కలిగించే పరిస్థితి" అని వివరించారు. ఆటిజం మూల కారణం గురించి డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి మరింత వివరిస్తూ, "ఆటిజం గర్భం నుంచే ప్రారంభమవుతుంది. గర్భం దాల్చిన మొదటి కొన్ని రోజులతో సహా, గర్భం అంతటా జరిగే సంఘటనలతో ఆటిజం ముడిపడి ఉంటుంది. ఒక చిన్న మానవ బ్లాస్టోసిస్ట్ దాని తల్లి గర్భాశయంలోని పోషకాలతో కూడిన లైనింగ్‌కు అటాచ్ కావడానికి ముందే, దాని నాడీ వ్యవస్థను రూపొందించే అంశాలు ఇప్పటికే అమలులో ఉన్నాయి. శిశువు తొలి వాతావరణం- గర్భం- చాలా కీలకం: గర్భధారణ సమయంలో పిండం మెదడు ప్రతి నిమిషానికి దాదాపు 250,000 న్యూరాన్‌లను ఉత్పత్తి చేస్తుంది కనుక, ఆ ప్రక్రియకు అంతరాయం కలిగించే అనుభవాలు అభివృద్ధి చెందుతున్న మెదడును శాశ్వత మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. గర్భాశయం శుభ్రమైనది కాదు. అభివృద్ధి చెందుతున్న పిండాలకు అభివృద్ధి సమయంలో జన్యు వ్యక్తీకరణలలో సహాయపడే సూక్ష్మ స్నేహితులు ఉంటాయి. పిండంలోకి ప్రవేశించే టాక్సిన్లు జరాయు అవరోధాన్ని దాటుతాయి. పిండంలోకి ప్రవేశించే టాక్సిన్లు స్నేహపూర్వక సూక్ష్మజీవులను చంపుతాయి. ఫలితంగా ఎపిజెనెటిక్ లోపాలు ఏర్పడతాయి. ఎపిజెనెటిక్ లోపాలు న్యూరోనల్ మైగ్రేషన్, న్యూరానల్ డిఫరెన్సియేషన్, ఫంక్షనల్ సర్క్యూట్రీ నిర్మాణాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది ఆటిజానికి దారితీస్తుంది. అందుకే, గర్భధారణలో టాక్సిన్‌లను నివారించాలి. అభివృద్ధి చెందుతున్న పిండానికి టాక్సిన్ లేని వాతావరణాన్ని అందించడం ద్వారా ఆటిజం లేకుండా ఆరోగ్యకరమైన బిడ్డ జన్మిస్తుంది" అని వివరించారు.

## దోమల నిర్మూలనకు మలాథిన్ పిచికారి

**గన్నవరం, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**


కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, బుద్ధవరం పంచాయతీ లో దోమల నియంత్రణకు మలాథిన్ మందును పిచికారి చేసే కార్యక్రమాన్ని మంగళవారం సర్పంచ్ బడుగు బాలమ్మ, పాలకేంద్రం అధ్యక్షులు జి. నరేంద్ర ప్రారంభించారు. రమణమ్మ చెరువు, దళిత వాడ ఏరియాలో మురుగు కాలువలతో పాటు ఖాళీగా ఉన్న స్థలాల్లో పెరిగిన మొక్కల్లోనూ, ప్రభుత్వ హాస్టళ్లు స్కూళ్లలోనూ దోమల నిర్మూలన కోసం మందును చెల్లించారు. ఈ సందర్భంగా బాలమ్మ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న దాదాజీ గూడెం, రాజీవ్ కాలనీ, పామర్తి నగర్ సెంటర్, బుద్ధవరం ఏరియాలో పూర్తిగా దోమల మందు పిచికారి చేస్తామని చెప్పారు. మురుగు కాలవల్లో నీరు నిలబడకుండా డ్రైన్లను శుభ్రం చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దొరబాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్, సిబ్బంది రామారావు తదితరులు పాల్గొన్నారు.



# చెరువులు.. పల్లె ప్రగతికి ఆధారాలు..

- ట్రిపుల్ ఆర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యం
- జల వనరులు నీటి సామర్థ్యం పెంపుపై దృష్టిపెట్టాలి
- 8 చెరువులకు రూ. 14.19 కోట్లతో పనులకు ప్రతిపాదనలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, సెప్టెంబర్ 10(జర్నలిస్ట్‌ఫైల్):**



చెరువులు పల్లెల ప్రగతికి ఆధారాలని.. నీటి నిల్వ సామర్థ్యం పెంపు, భూగర్భ జలాల వృద్ధి, పర్యావరణ ప్రయోజనాలు, వ్యవసాయ ఉత్పాదకత - అన్నదాతల ఆదాయాల పెంపు వంటి బహుళ ప్రయోజనాలకు చెరువులు చిరునామా అని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్ఆర్ఆర్) పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన నీటి వనరుల మరమ్మతులు, నవీకరణ, పునరుద్ధరణ (ఆర్ఆర్ఆర్) పథకానికి సంబంధించి జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాగు, తాగు నీటి అవసరాలను తీర్చే చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేలా ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా, భూగర్భ జలాల రీఛార్జ్ జరిగేలా ప్రత్యేక పనులు చేపట్టాల్సిన అవసరముందన్నారు. నీటి వనరుల సుస్థిర నిర్వహణకు సామాజిక భాగస్వామ్యంతో పాటు స్వయం సమృద్ధి వ్యవస్థల మద్దతు అవసరమన్నారు. ట్రిపుల్ ఆర్ పథకం కింద తాజాగా మైలవరం, విజయవాడ రూరల్, రెడ్డిగూడెం మండలాల పరిధిలోని ఎనిమిది చెరువుల అభివృద్ధికి సంబంధించి రూ. 14.19 కోట్లతో పనులను ప్రతిపాదించడం జరిగిందని.. తాజా సమావేశంలో నిపుణులు సూచించిన అంశాల మేరకు ట్రిపుల్ ఆర్ పథకం లక్ష్యాలు నెరవేరేలా డీపీఆర్‌లు ఉండేలా చూడాల న్నారు. చెరువు కట్టల పటిష్టీకరణ, సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటుతో పర్యాటకంగా కూడా అభివృద్ధికి వీలుంటుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ ఆర్.మోహన్‌రావు, కమిటీ కన్వీనర్ పి.గంగయ్య, కేంద్ర జల సంఘం నుంచి నామినేట్ అయిన డీడీ కె.శంకర్, సైంటిఫిక్ ఆఫీసర్ టి.వెంకటగిరి, డ్వామా పీడీ ఎ.రాము, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, గ్రౌండ్ వాటర్ డీడీ ఎం.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిషేధం ఎత్తివేసినా ఆగని నిరసనలు



## నేపాల్ మొత్తం ఉద్రిక్తం.. మాజీ ప్రధానులు, మంత్రుల ఇళ్లపై రాళ్ల దాడులు.. నిషేధాజ్ఞలు లెక్కచేయని ఆందోళనకారులు

**కఠ్మాండు**,సెప్టెంబరు 10:సామాజిక మాధ్యమాలపై నిషేధం ఎత్తివేసినా నేపాల్‌లో ఆందోళనలు సద్దుమణగలేదు. ప్రధాని పదవికి కెపి శర్మ ఓలి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగారు. అవినీతి పరులపై చర్యలు తీసుకోవాలంటూ కఠ్మాండు సహా పలు జిల్లాల్లో యువత ముఖ్యంగా విద్యార్థులు నిరసన చేపట్టారు. ప్రజలు గుమిగూడకూడదని ఆంక్షలున్నా లెక్కచేయకుండా ఆందోళన చేపట్టారు. మాజీ ప్రధానులు, మంత్రుల ఇళ్లపై రాళ్ల దాడులు జరిగాయి. నేపాల్‌లో వరుసగా రెండో రోజూ ఆందోళనలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన హింసాత్మక ఆందోళనల తర్వాత ప్రభుత్వం సామాజిక మాధ్యమాలపై నిషేధం ఎత్తివేసినప్పటికీ యువత మంగళవారం నిరసనలు చేపట్టారు. నేపాల్‌రాజధాని కఠ్మాండులోని కాలంకి, బనేశ్వర్, లలిత్‌పూర్ జిల్లాలోని చపాగౌన్‌టెచోల్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. సోమవారం నిరసనల తర్వాత కఠ్మాండులో నిరవధిక కర్ఫ్యూవిధించారు. ప్రజలు గుమిగూడకుండా నిషేధం విధించారు. నిషేధాజ్ఞలు బేఖాతరు చేస్తూ యువత ముఖ్యంగా విద్యార్థులు మళ్లీ భద్రతా దళాలతో ఘర్షణకు దిగుతున్నారు. విద్యార్థులను చంపవద్దంటూ నినాదాలు చేస్తున్నారు. ప్రధాని కెపి శర్మ ఓలి రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి పరులైన నాయకులపై చర్యలు తీసుకోవాలని పట్టుబడుతున్నారు. కాలంకి ప్రాంతంలో టైర్లు తగలబెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానిని దొంగగాపేర్కొంటూ కెపి శర్మ దేశాన్ని వదిలి పోవాలని డిమాండ్ చేస్తున్నారు. లలిత్‌పూర్‌లో నేపాల్ కమ్యూనికేషన్ల మంత్రి పృథ్వి సుబ్బా గురుంగ్ నివాసంపై రాళ్ల దాడిచేశారు. నేపాల్‌లో సామాజిక మాధ్యమాలపై నిషేధానికి గురుంగే ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటిపై దాడి జరిగింది.

**మాజీ ప్రధానుల ఇళ్లు ధ్వంసం**

లలిత్‌పూర్‌లో ఉన్న మాజీ ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ ప్రచండనివాసాన్ని సైతం నిరసనకారులు ధ్వంసంచేశారు. కఠ్మాండులోని బుదానిల్‌కాంత ప్రాంతంలో ఉన్న మరో మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్ బా నివాసం ఎదుట విద్యార్థులు నిరసన ప్రదర్శన చేశారు. వరుసగా రెండోరోజూ ఆందోళనలు కొనసాగుతున్న వేళ నేపాల్ వ్యవసాయశాఖమంత్రి రామ్‌నాథ్ అధికారి తనపదవికి రాజీనామా చేశారు. సోమవారం నిరసనకారులపట్ల ప్రభుత్వం అనుసరించిన తీరును ఆయన ఖండించారు. ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం వల్ల 19 మంది ప్రాణాలు కోల్పోయారని ఆయనతెలిపారు. ఇప్పటికే ఘర్షణలకు బాధ్యత వహిస్తూ నేపాల్ హోంమంత్రి రమేష్ లేఖక్ రాజీనామా చేశారు. భద్రతా బలగాలతో యువత మళ్లీ ఘర్షణకు దిగడంతో ఉదయం 8 గంటల 30 నిమిషాల నుంచి కాఠ్‌మాండూ,భక్తాపూర్,లలిత్‌పూర్ తదితర జిల్లాల్లో నిరవధిక కర్ఫ్యూ విధించారు. కాఠ్‌మాండూలో సైన్యం పహారా కాస్తోంది. అయినప్పటికీ నిరసనకారులు ఏమాత్రం తగ్గడంలేదు.

సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించడంపై నేపాల్‌లో సోమవారం యువత చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నేపాలీ యువత కఠ్‌మాండులో నిరసనకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో కొందరు నిరసనకారులు పార్లమెంటు ఆవరణలోకి చొచ్చుకెళ్లడంతో పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. ఈ ఘటనలో 19 మంది మృతి చెందగా 300 మందికి పైగా గాయపడ్డారు. మరోవైపు, ఆందోళనల్లో పలువురు మరణించడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. సామాజిక మాధ్యమాలపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆందోళనల్లో మరణించిన వారికి పరిహారం చెల్లిస్తామని నేపాల్ ప్రధాని కెపి శర్మ వెల్లడించారు. గాయపడిన వారికి ఉచితంగా చికిత్స అందిస్తామని పేర్కొన్నారు.

## ఆర్థికమంత్రిని వెంటాడి కొట్టిన ఆందోళనకారులు

**కఠ్మాండు**, సెప్టెంబరు 10:నేపాల్‌లో అవినీతిపై కదం తొక్కిన నేపాల్ యువత. మంత్రులు, అధికార పార్టీకి చెందిన నేతలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్నారు. రాజధాని కఠ్మాండు, ఇతర ప్రధాన నగరాల్లోని మంత్రుల నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాలకు నిప్పు పెడుతున్నారు. తాజాగా ఆ దేశ ఆర్థిక మంత్రి, డిప్యూటీ ప్రధాని బిష్ణు ప్రసాద్ పాడేల్‌పై ఆందోళనకారులు దాడికి పాల్పడ్డారు. కాలితో తన్ని, వీధుల్లో పరిగెత్తించి మరీ కొట్టారు. ప్రాణ భయంతో పారిపోయేందుకు ప్రయత్నించిన అతడిని వెంబడించి మరీ చితకబాదారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. మరోవైపు భక్తపూర్‌లోని ప్రధాని కెపి శర్మ ఓలి ప్రైవేట్ నివాసంపై దాడి చేసిన నిరసనకారులు దానికి నిప్పు పెట్టారు. అనంతరం డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో కూడా ప్రస్తుతం వైరల్ అవుతోంది. యువత ఆందోళనలతో రాజకీయ సంక్షోభం తలెత్తింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చెలరేగడంతో నేపాలీ ప్రధాని ఈ మధ్యాహ్నం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దేశంలో జరుగుతున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో సైన్యం సూచన మేరకు ఆయన ప్రధాని పదవి నుంచి వైదొలిగారు. ఆయన దేశం విడిచి వెళ్లే పరిస్థితి ఏర్పడింది.




## నేపాల్‌కు విమానసర్వీసులు నిలిపివేత

**న్యూఢిల్లీ**, సెప్టెంబరు 10 : నేపాల్‌రాజధాని ఖాట్మండూలో చెలరేగిన తీవ్ర అల్లర్ల కారణంగా విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భద్రతా కారణాల దృష్ట్యా అక్కడి త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అధికారులు మూసివేశారు. దీంతో ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో ఖాట్మండూకు తమ సర్వీసులన్నింటినీ తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. పలు ఇతర అంతర్జాతీయ విమానాలను ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయానికి మళ్లించారు. ఈ పరిణామాలపై ఇండిగో ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఖాట్మండూ విమానాశ్రయం మూసివేత కారణంగా, మా విమాన సర్వీసులను రద్దు చేశాం. ప్రయాణికులు ఎదుర్కొన్న అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు తమ వెబ్‌సైట్ ద్వారా ప్రత్యామ్నాయ విమానాన్ని ఎంచుకోవచ్చని లేదా డబ్బులు వాపసు (రీఫండ్) పొందవచ్చని సూచించింది. తాము స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, వీలైనంత త్వరగా సేవలను పునరుద్ధరిస్తామని స్పష్టం చేసింది. తాజా సమాచారం కోసం తమ అధికారిక ప్రకటనలను గమనించాలని ప్రయాణికులను కోరింది. విమానాశ్రయం మూసివేతతో ఖాట్మండూవెళ్లాల్సిన అనేక విమానాలు లక్నోలో ల్యాండ్ అయ్యాయి. దుబాయ్ నుంచి బయల్దేరిన ఫ్లై దుబాయ్ (539) విమానం మధ్యాహ్నం 3:25 గంటలకు లక్నోలోదిగింది. అదే విధంగా, బ్యాంకాక్ నుంచి వచ్చిన థాయ్ లయన్ ఎయిర్ (220) విమానం మధ్యాహ్నం 3:05 గంటలకు లక్నో చేరుకుంది. ఢిల్లీనుంచి బయల్దేరిన ఇండిగో విమానం (6ఇ1153) కూడా మధ్యాహ్నం 2:40 గంటలకు లక్నోలోనే ల్యాండ్ అయింది. ముంబై నుంచి ఖాట్మండూ వెళ్లాల్సిన మరో ఇండిగో విమానాన్ని (6ఇ1157) మొదట లక్నోకు, ఆ తర్వాత ఢిల్లీకిమళ్లించారు. నేపాల్‌లో పరిస్థితులు అదుపులోకి వచ్చే వరకు విమాన రాకపోకలపై అనిశ్చితి కొనసాగనుంది. విమానయాన సంస్థలు పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాయి.

## నేపాల్‌లోని భారతీయులకు విదేశాంగశాఖ అలర్ట్

**న్యూఢిల్లీ**, సెప్టెంబరు 10 : పొరుగు దేశమైన నేపాల్‌లో హింసాత్మక ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. నిరసనకారులు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణల్లో 19మంది ప్రాణాలు కోల్పోగా, వందలాదిమంది గాయపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. నేపాల్‌లో నివసిస్తున్న భారత పౌరులు అత్యంత జాగ్రత్తగాఉండాలని,స్థానికఅధికార యంత్రాంగం జారీ చేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఈరోజు హెచ్చరించింది. నిన్నటినుంచి నేపాల్‌లో జరుగు తున్న ఘటనలు మమ్మల్ని తీవ్రంగా కలచివేశాయి. ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. మృతుల కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా మని పేర్కొంది.ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నేపాల్‌రాజధాని ఖాట్మండుతో పాటు పలు ప్రధాననగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించారు. ఈనేపథ్యంలో భారతీ యులు ఎలాంటి సమూహాల్లో పాల్గొనవద్దని, అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని విదేశాంగశాఖ సూచించింది. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధాన్ని ఎత్తివేసిన మరుసటి రోజే నిరసనలు మళ్లీ హింసాత్మకంగా మారడంతో అధికారులు ఖాట్మండు రింగ్ రోడ్ పరిధిలో నిరవధిక కర్ఫ్యూను అమలు చేస్తున్నారు.

కర్ఫ్యూ సమయంలో నిరసనలు, సమా వేశాలు, సభలపై పూర్తి నిషేధం విధించినట్లు ఖాట్మండు జిల్లా అధికారి ఛబిలాల్ రిజాల్ వెల్లడించారు. ప్రభుత్వం అవినీతిని అరికట్ట డంలో, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ డంలో విఫలమైందంటూ "జెన్ జడ్" యువత పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తోంది. దీనికి తోడు ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం నిషేధం విధించడం వారి ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసింది.





## భారత సంతతి ప్రజలపై ఆసీస్ సెనేటర్ ఫైర్

### తక్షణమే క్షమాపణలు చెప్పాలని ప్రధాని సీరియస్

**కాన్‌బెర్రా**, సెప్టెంబరు 10 : ఆస్ట్రేలియాలో భారత సంతతి ప్రజలను కించపరిచేలావ్యాఖ్యలు చేసిన సెనెటర్‌పై ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ తీవ్రంగా స్పందించారు. సదరు సెనెటర్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, భారత సమాజానికి తక్షణమే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఆస్ట్రేలియాలో పెరుగుతున్న జీవన వ్యయానికి, ఇతర సమస్యలకు భారత వలసదారులే కారణమంటూ సెంటర్ రైట్ లిబరల్ పార్టీకి చెందిన సెనెటర్ జసింటా ప్రిన్స్ ఆరోపించారు. అధికార లేబర్ పార్టీ కేవలం ఓట్ల కోసమే భారతీయులను పెద్ద సంఖ్యలో దేశంలోకి రప్పిస్తోందని ఆమె విమర్శించారు. లేబర్ పార్టీకి వచ్చిన ఓట్లను, ఆస్ట్రేలియాకు వలస వచ్చిన భారతీయుల సంఖ్యను పోల్చి చూస్తే విషయం అర్థమవుతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై ఆస్ట్రేలియాలోని భారత సంతతి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జసింటా ప్రిన్స్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు. మరోవైపు, ఆమె సొంత పార్టీ అయిన లిబరల్ పార్టీ కూడా ఈ వ్యాఖ్యలను ఖండించడం గమనార్హం. ఈ వివాదంపై ప్రధాని ఆంథోనీఆల్బనీస్ స్పందిస్తూ, సెనెటర్ చేసిన వ్యాఖ్యలు భారత సమాజాన్ని తీవ్రంగా బాధించాయి. ఆమె వెంటనే క్షమాపణ చెప్పాలి. ఆమె సొంత పార్టీ నాయకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నారని స్పష్టం చేశారు. ఈ పరిణామాలను భారత విదేశాంగ శాఖ నిశితంగా పరిశీలిస్తూ, ఆస్ట్రేలియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది.

## దేశ పౌరులపై చైనా సాఫ్ట్‌వేర్‌తో పాక్ సైబర్ నిఘా

**ఇస్లామాబాద్**, సెప్టెంబరు 10: కోట్లాది మంది దేశ ప్రజలపై పాకిస్థాన్ నిఘాపెట్టింది. ఫోన్ ట్యాపింగ్ సిస్టమ్‌ద్వారా ఆ స్పైయింగ్ జరుగుతోంది. చైనా నిర్మించిన ఇంటర్నెట్ ఫైర్‌వాల్ ద్వారా పాకిస్తాన్‌లో సోషల్ మీడియాను సెన్సార్ చేస్తున్నారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొన్నది. మంగళవారం దీనికి సంబంధించిన రిపోర్టును రిలీజ్ చేశారు. చైనీస్, పాశ్చాత్య టెక్నాలజీ ద్వారానిర్మించిన మానిటరింగ్ నెట్వర్క్‌తో ప్రజలపై నిఘా పెడుతున్నట్లు ఆమ్నెస్టీ పేర్కొన్నది.

పాకిస్థాన్‌లో పొలిటికల్, మీడియా స్వేచ్ఛపై ఇప్పటికే ఆంక్షలు ఉన్నాయి.

లాఫుల్ ఇంటర్‌సెప్ట్ మేనేజ్మెంట్ సిస్టమ్ (ఎల్‌ఐఎంఎస్) ద్వారా సుమారు 40 లక్షల మొబైల్ ఫోన్లను ట్యాపింగ్ చేసే సామర్థం పాకిస్థాన్ నిఘా ఏజెన్సీలకు ఉన్నట్లు తెలుస్తోంది. రెండురకాల మానిటరింగ్ వ్యవస్థలు ఉన్నాయని, కాల్ ట్యాపింగ్.. టెక్స్ట్‌లను ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు తెలుసుకోవచ్చు అని, దేశవ్యాప్తంగా వెబ్‌సైట్లు, సోషల్ మీడియాను బ్లాక్ చేసే విధంగా టెక్నాలజీ కూడా ఉందని ఆమ్నెస్టీ చెప్పింది.

## నేపాల్ ఆందోళనకు కేంద్రబిందువు 'హామీనేపాల్'




**కఠ్మాండు**, సెప్టెంబరు 10 : సామాజిక మాధ్యమాలపై నిషేధిస్తూ తీసుకున్న నిర్ణయం ఏకంగా నేపాల్ ప్రభుత్వాన్ని కూలదోసింది. పోలీసుల చర్యల వల్ల ఇప్పటివరకు కనీసం 20 మంది ప్రాణాలు కోల్పోగా, 300 మందికి పైగా గాయపడ్డారు. పరిస్థితి తీవ్రతరమవడంతో పలువురు మంత్రులు కూడా రాజీనామా చేశారు. ఆందోళనకారుల డిమాండ్లకు కెపి శర్మ ఓలి తలొగ్గి ప్రధాని పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రభుత్వం ఈ నిషేధంపై వెనక్కి తగ్గి, అత్యవసర మంత్రివర్గ సమావేశం నిర్వహించి తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొంది. అయితే ఈ స్థాయిలో ఉద్యమం తలెత్తడానికి కారణం ఓ వ్యక్తి. అతడే 36 ఏళ్ల సుదన్ గురుంగ్. హామి నేపాల్ అనే ఎన్‌జీవో సంస్థకు అధ్యక్షుడు. 2015లో భారీ భూకంపం తర్వాత ఈ సంస్థను ఆయన స్థాపించారు. ఆ విపత్తులో తన బిడ్డను కోల్పోవడం ఆయన జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. అప్పటివరకు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న సుదన్, తర్వాత పౌర సేవా కార్యక్రమాల్లోకి అడుగుపెట్టారు. భూకంపం తర్వాత సహాయ కార్యక్రమాలు చేపట్టిన ఆయన, తరువాత బిపి కొయిరాల హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో పారదర్శకత కోరుతూ 'ఘోప క్యాంప్' పేరుతో ఆందోళనలు వ్యక్తం చేశారు. ఈ సారి సామాజిక మాధ్యమాల నిషేధంపై యువతలో ఉద్భుతమైన ఆగ్రహాన్ని ఆయన ఒక దారిలోకి నడిపించారు. తాజాగా నేపాల్‌లో జరిగిన నిరసనల్లో ఎక్కువగా పాల్గొన్న వారు పాఠశాల, కాలేజీ విద్యార్థులే. వెంటనే సోషల్ మీడియా బ్యాన్ ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. పరిస్థితి వేడెక్కడం వల్ల కొందరు పార్లమెంట్ కాంప్లెక్స్‌లోకే దూసుకెళ్లారు. దీంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు జలఫిరంగులు, బాష్పవాయు గోళాలు ప్రయోగించారు. చివరికి కాల్పులు జరిపే స్థితి ఏర్పడింది. ఈ ఆందోళనలు పోఖరా, బుట్వాల్, భైరహ్వా, భరత్‌పూర్, ఇటాహరి, దమక్ వంటి ప్రాంతాలకు విస్తరించాయి. ఫలితంగా అనేక చోట్ల కర్ఫ్యూ అమలు చేయాల్సి వచ్చింది.

ఈ ఆందోళనతోపాటు మరో కొత్త తరహా ఉద్యమం కూడా ఊపందుకుంది. రాజకీయ నాయకుల పిల్లలు, ధనవంతుల వారసులు అవినీతి సొమ్ముతో సుఖాలు అనుభవిస్తున్నారని ఆరోపిస్తూ ఆందోళనలు చేపట్టారు. నెపో కిడ్ మూవ్‌మెంట్‌గా పిలుస్తున్నారు. ఇక ప్రధాని పదవికి కెపి శర్మ ఓలీ రాజీనామాతో ఆ దేశ పగ్గాలు సైన్యం చేతుల్లోకి వెళ్లనున్నాయని తెలుస్తోంది. రాజీనామాకి ముందు నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్దెల్‌తో ప్రధాని కెపి శర్మ ఓలీ మాట్లాడి సమగ్ర చర్చలుజరిపారు. ఈ క్లిష్ట పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు, ప్రధాని నివాసం నుంచి సురక్షితంగా వెళ్లిపోయేందుకు మిలిటరీ సహాయం కావాలని అడిగినట్లు తెలిపాయి. అయితే ప్రధాని పదవికి రాజీనామా చేయాలని ఓలికి ఆర్మీ చీఫ్ సూచించినట్లు తెలుస్తోంది. ఈ ఘర్షణలను సైన్యం అదుపులోకి తీసుకువస్తుందని పేర్కొన్నట్లు సమాచారం. దేశంలోని అస్థిర పరిస్థితుల వేళ త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. అన్ని విమానాలను రద్దు చేశారు. 300 మంది సైనికులను అక్కడ మోహరించారు. మంత్రులను వారి అధికారిక నివాసాల నుంచి ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా తరలిస్తున్నారు.

## సరిహద్దుల్లో భారత్ మరింత అప్రమత్తం

**కఠ్మాండు**, సెప్టెంబరు 10 : హిమాలయ దేశం నేపాల్‌లో ఉద్రిక్తతలు హింసాత్మకంగా మారాయి. ప్రధాని, డిప్యూటీప్రధాని, ఇతర విపక్ష నేతల ఇళ్లకు ఆందోళన కారులు నిప్పుపెట్టడంతో పరిస్థితి మరింత తీవ్రస్థాయికి చేరింది. ఆందోళనకారులు సుప్రీంకోర్టుకుసైతం నిప్పంటించారు. దీనితో దేశంలో పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఐదురాష్ట్రాల సరిహద్దులవద్ద భారీగా దళాలను మొహరించింది. బీహార్, ఉత్తరాఖండ్, కోల్‌కత్తా, ఉత్తరప్రదేశ్, సిక్కిం రాష్ట్రాలు నేపాల్‌సరిహద్దును పంచుకుంటున్నాయి. భారత్‌నేపాల్ సరిహద్దు వద్ద పోలీసులు హైఅలర్ట్ అయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని నేపాల్ సరిహద్దు పానిటాంకి వద్ద పోలీసు పోస్టును ఏర్పాటు చేశారు. అక్కడికి అదనపు బలగాలను మోహరించినట్లు ఎస్పీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. బార్డర్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు యువత ఆందోళనతో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు నేపాల్‌లోని భారతీయులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుతం అక్కడ జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అక్కడ భారతీయ పౌరులు జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని సూచించింది.



స్థానిక అధికారుల మార్గదర్శకాలను పాటించాలని పేర్కొంది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. 'నిన్నటి నుంచి నేపాల్‌లో జరుగుతున్న పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాము. చాలా మంది యువకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. రాజధాని కాఠ్మాండు సహా అనేక నగరాల్లో అధికారులు కర్ఫ్యూ విధించారు. నేపాల్‌లోని భారతీయ పౌరులు జాగ్రత్తగా ఉండాలి. అక్కడి అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలను పాటించాలి' అని ప్రకటనలో తెలిపింది.

## శిక్ష సరిగ్గా అనుభవించలేదు.. మళ్లీ జైలుకెళ్లండి

### థాయ్‌లాండ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవత్రకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు!



**బ్యాంకాక్**, సెప్టెంబరు 10 : థాయ్‌లాండ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవత్రకు ఆ దేశ సుప్రీంకోర్టు షాక్ ఇచ్చింది. గతంలో ఓ కేసులో విధించిన శిక్షను సరిగ్గా అనుభవించలేదనే కారణంతో మరో సారి ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. 2006లో సైనిక తిరుగుబాటు కారణంగా థాయ్‌లాండ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవత్ర పదవి నుంచి వైదొలిగారు. 2008లో రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై ఆయనకు జైలు శిక్ష విధించడంతో థక్సిన్ దేశం నుంచి పారిపోయారు. విదేశాల్లో ఉంటున్న షినవత్ర 15 ఏళ్ల తర్వాత 2023లో థాయ్‌లాండ్‌కు తిరిగొచ్చారు. ఆయన స్వదేశానికి తిరిగొచ్చిన తర్వాత గతంలో నమోదైన కేసులో భాగంగా ఆయనకు సుప్రీంకోర్టు 8 ఏళ్ల జైలు శిక్ష విధించింది.

అయితే థక్సిన్ అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని శిక్షను యేడాదికి తగ్గిస్తూ రాజు నిర్ణయం తీసుకున్నారు. జైలు శిక్షను తగ్గించినప్పటికీ వైద్య కారణాలతో థక్సిన్ ఒక్కరోజు కూడా జైల్లో శిక్ష అనుభవించకపోవడంతో అక్కడి ప్రజల్లో పలు అనుమానాలు మొదలయ్యాయి. ఆయన నిజంగానే అనారోగ్యానికి గురయ్యారా లేదా శిక్ష నుంచి తప్పించుకోవడానికి తప్పుడు ఆధారాలు సృష్టించారా అనే ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అనుమానాల వేళ అప్పట్లో సరిగ్గా శిక్ష అనుభవించని కారణంగా థక్సిన్‌కు ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. కంబోడియా సెనెట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని, థక్సిన్ కుమార్తె షినవత్ర ఫోనులో మాట్లాడటం సంచలనం రేపడంతో ఇటీవల అక్కడి రాజ్యాంగ న్యాయస్థానం ఆమెను పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

## సంక్షిప్తంగా..

### 'ఆశ లేకపోతే.. జీవితం లేదు': డికె శివకుమార్




**బెంగళూరు**,సెప్టెంబరు 10 :కర్ణాటకలో సిఎం మార్పు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. డిప్యూటీ సిఎం డికె శివకుమార్ చేసిన వ్యాఖ్యలే ఇందుకు కారణం. ఆశ లేకపోతే జీవితమే లేదంటూ ముఖ్యమంత్రి పదవిపై డికె తాజాగా ఓ సదస్సులో పరోక్షంగా వ్యాఖ్యానించారు. ఇంతకీ ఏం జరిగిందంటే.. ఇండియాటుడే కాంక్లేవ్ సౌత్2025లో డికె శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రెండో అర్ధభాగంలో ముఖ్యమంత్రి పదవి చేపడతారా? అని అడిగిన ప్రశ్నకు ఆయన ఆసక్తికరంగా బదులిచ్చారు. నేరుగా సిఎం పోస్ట్ గురించి ప్రస్తావించకుండా 'దీనికి నేను జవాబు చెప్పను. కాలమే అన్నింటికీ సమాధానం చెప్పాలి. చెబుతుంది కూడా. ఈ ప్రపంచంలో ఎవరైనా సరే ఆశతోనే జీవించాలి. ఆశ లేకపోతే జీవితమే లేదు' అని వ్యాఖ్యానించారు. అయితే, కర్ణాటకలో సమష్టి నాయకత్వం కొనసాగుతోందని డికె ఈ సందర్భంగా చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండే తమకు అత్యున్నతమని అన్నారు.

### వరదబాధితులకు విరాళంగా బంగారం, వెండి

**చండీగఢ్**,సెప్టెంబరు 10 :వరద బాధితులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు వంటివి విరాళంగా ఇవ్వడం చూస్తుంటాం. కానీ ఓ గ్రామంలో ప్రజలు ఏకంగా బంగారం, వెండిని విరాళంగా ఇచ్చారు. వాళ్లే హర్యానాలోని నుహ్ జిల్లాలోని మేవాట్ ప్రాంతానికి చెందిన గ్రామస్తులు. ఇటీవల పంజాబ్‌ను భారీ వరదలు ముంచెత్తిన సంగతి తెలిసిందే. కొండ ప్రాంతాల్లో పడిన వర్షాల కారణంగా దాదాపు 2 వేల గ్రామాలు ప్రభావితమయ్యాయి. వారికి సాయం అందించేందుకు మేవాట్ గ్రామస్తులు ముందుకొచ్చారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వారి శక్తి మేరకు సాయం అందించారు. కొందరు మహిళలు బంగారం, వెండిని కూడా విరాళంగా అందించారు. తలక్‌పురి గ్రామానికిచెందిన 75 ఏళ్ల రహీమితో సహా సోహ్నా బ్లాక్‌లోని నుహ్ గ్రామానికి చెందిన మరికొంతమంది మహిళలు కలిసి రూ.5 లక్షల విలువైన సుమారు 2 కిలోల వెండి, 20 గ్రాముల బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. దీంతోపాటు దుప్పట్లు, పొడి రొట్టెలు వంటి వాటిని కూడా ఆ గ్రామస్తులు సాయంగా పంపారు.

### 'ఆపరేషన్ సిందూర్'లో 400 మంది శాస్త్రవేత్తలు



**న్యూఢిల్లీ**,సెప్టెంబరు 10 :ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మంది శాస్త్రవేత్తలు నిరంతరం పనిచేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చైర్మన్ వి నారాయణన్ వెల్లడించారు. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరును పరిశీలిస్తూ, జాతీయ భద్రత అవసరాలకు అనుగుణంగా ఉపగ్రహాల సమాచారాన్ని అందించినట్లు చెప్పారు. ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 52వ జాతీయ మేనేజ్‌మెంట్ కన్వెన్షన్‌లో ప్రసంగిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని ఉపగ్రహాలు నిరంతరం కచ్చితత్వంతో పనిచేశాయి. అవసరమైన సమాచారాన్ని అందించాయి. 400లకు పైగా శాస్త్రవేత్తలు పూర్తి సమయం పనిచేశారు. భూ పరిశీలన, కమ్యూనికేషన్‌కు సంబంధించిన ఉపగ్రహాలన్నీ సంపూర్ణ సేవలందించాయి అని పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటివరకు 7700 క్షేత్ర స్థాయి పరీక్షలు పూర్తిచేశామన్నారు.

### నేపాల్ హింసపై నటి మనీషా కొయిరాలా ఆవేదన

**ముంబయి**, సెప్టెంబరు 10 : పొరుగు దేశం నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తారస్థాయికి చేరింది. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధానికి వ్యతిరేకంగా చెలరేగిన నిరసనలు హింసాత్మకంగా మారి దేశాన్ని అట్టుడికిస్తున్నాయి. ఈ తీవ్ర పరిణామాల నేపథ్యంలో ప్రధాని కెపి శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన దుబాయ్‌లో ఆశ్రయం కోరినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలపై భద్రతా కారణాలతో నిషేధం విధించడంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. దీనికి ప్రభుత్వ అవినీతి కూడా తోడవడంతో ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఈ నిరసనలు అనతికాలంలోనే హింసాత్మకంగా మారాయి. మంగళవారం నిరసనకారులు ఏకంగా పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి నిప్పుపెట్టడంతో పరిస్థితి చేయిదాటిపోయింది. ఈ ఘర్షణల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, తన సొంత దేశంలో జరుగుతున్న హింసపై ప్రముఖ బాలీవుడ్ నటి మనీషా కోయిరాలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ పరిస్థితులపై స్పందించిన మనీషా కోయిరాలా, ఇన్‌స్టాగ్రామ్‌లో రక్తపు మరకలతో ఉన్న ఒక బూటు ఫొటోను షేర్ చేశారు. ఇది కేవలం ఫొటో కాదు, నేపాల్‌లో జరుగుతున్న హింసకు సాక్ష్యం. ఇది చాలా భయంకరంగా ఉందని ఆమె ఆవేదన చెందారు.

# గుంటూరు జాయింట్ కలెక్టర్‌కు రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ శుభాకాంక్షలు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవను రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆహ్వానం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు.
అదే సందర్భంలో 7వ రాష్ట్ర రెవెన్యూ క్రీడలు, సంస్కృతిక ఉత్సవాలు – 2025 కు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. ఈ క్రీడలు నవంబర్ 7, 8, 9 తేదీలలో అనంతపురం జిల్లాలో జరగనున్నాయి. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించాలని కోరగా, జాయింట్ కలెక్టర్ అన్ని విధాల సహకరిస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటరావు, రాష్ట్ర కార్యదర్శి దివ్య, షేక్ ధరియావలి, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. అనుపమ, జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్, ఖజాంచి నాగేశ్వరరావు, కార్యదర్శులు రామారావు, బాబురావు, లీల, సంధ్యారాణి, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగుల భవన నిర్మాణం కోసం వినతి



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మైదుకూరు తాలూకా అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు మరియు అసోసియేట్ ప్రెసిడెంట్ కె. వీరాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం బద్వేల్‌లోని గౌరవనీయులైన రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ. చంద్రమోహన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా మైదుకూరులో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ RDO కి ఒక వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, కార్యకలాపాల నిర్వహణకు ఒక సొంత కార్యాలయం అవశ్యకతను వారు RDO కి వివరించారు. RDO ఏ. చంద్రమోహన్ ఈ వినతిని సానుకూలంగా పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు మరియు అసోసియేట్ ప్రెసిడెంట్ కె. వీరాంజనేయులు పాల్గొన్నారు.

# పోలీస్ సిబ్బందికి వసతి సముదాయం



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : రాజధాని ప్రాంతంలో భద్రతా విధులు నిర్వర్తించడానికి ఇతర జిల్లాల నుండి విధులకు హాజరయ్యే పోలీస్ సిబ్బందికి తాత్కాలిక నివాస సదుపాయాల కోసం తుళ్లూరులో కొత్త వసతి సముదాయం ఏర్పాటు చేశారు. బుధవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు.

**సక్రమ సదుపాయాలే సమర్థవంతమైన విధులకు మూలం**

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ – సక్రమమైన సదుపాయాల సమకూర్పే సమర్థవంతమైన విధి నిర్వహణకు పునాదిగా ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న వసతులు సరిపోకపోవడంతో, సిఆర్డిఏ అనుమతితో వినియోగంలో లేని ఎన్ఏసీ కార్యాలయాన్ని పునరుద్ధరించి వసతి సముదాయంగా మార్చామని వివరించారు.

**మంత్రి లోకేష్ సహకారంతో ఆధునికీకరణ**

ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సహకారంతో సిఎస్ఆర్ నిధుల క్రింద పది లక్షల రూపాయల వ్యయంతో పునరుద్ధరణ చేపట్టారు. ప్లంబరింగ్, ఎలక్ట్రికల్ పనులు, బాత్రూములు, వసతి గదులు సిద్ధం చేసి నూరుమంది పోలీస్ సిబ్బందికి సౌకర్యవంతమైన నివాసం కల్పించారు.
ఈ వసతి సముదాయం సిద్ధం చేయడంలో విశేష కృషి చేసిన అదనపు ఎస్పీ (ఎల్అండ్ఓ) ఏటీవీ రవికుమార్, నార్త్ డిఎస్పీ మురళీకృష్ణ, తుళ్లూరు డిఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, కానిస్టేబుల్ జోషఫ్, హోంగార్డు జానీ బాషాలకు ఎస్పీ అభినందనలు తెలిపారు. వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

**మందడంలో అదనపు వసతి**

మందడం గ్రామంలో మరో నూరుమందికి సరిపడే వసతి సముదాయం ఏర్పాటు చేసిన తుళ్లూరు డిఎస్పీ మురళీకృష్ణ కృషిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.
ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు డిఎస్పీలు మురళీకృష్ణ (తుళ్లూరు), మురళీకృష్ణ (నార్త్), తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు, తుళ్లూరు సిఐలు కొంక. శ్రీనివాస్, అంజయ్య, ట్రాఫిక్ సిఐలు కోటేశ్వరరావు, నరేష్, తాడేపల్లి ఎస్సై ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు...

# వి.జె కళాశాల అధ్యాపకునికి పి.హెచ్.డి ప్రధానం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** వి.జె కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు బి.వి.ఎల్. ఆరాధ్య శర్మ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పి. హెచ్.డి పట్టా పొందారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సెక్రటరీ %డ% కరస్పాండెంట్ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ, "ముగిల్ సెఫాలస్ యొక్క జీవశాస్త్ర, బయోకెమికల్ పరిశీలనలను కృష్ణా ఎస్ట్యూరీ నుంచి ముల్లెట్ ఫిషరీపై లోతైన పరిశోధనలు చేసి డాక్టరేట్ పొందారు" అని తెలిపారు. ఆరాధ్య శర్మ ఈ పరిశోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జంతుశాస్త్రం, ఆక్వాకల్చర్ విభాగం ప్రొఫెసర్ పి.వి.కృష్ణ మార్గదర్శకత్వంలో పూర్తి చేసినట్లు వివరించారు. అలాగే, హెల్త్ ఆప్టిమైజేషన్ కోసం వలస సమయంలో హిల్సాలో పోషకాలు, ఫ్యాటీ ఆసిడ్స్ విశ్లేషణ పై రూపొందించిన పద్ధతికి పేటెంట్ పొందిన నలుగురిలో ఆరాధ్య శర్మ ఒకరని రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్, సహచర అధ్యాపకులు డాక్టర్ ఆరాధ్య శర్మను శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# జీవో 30 నిరుపేదలకు వరం : ఎమ్మెల్యే నసీర్

- ఇళ్లపై పూర్తి హక్కులు కల్పిస్తున్నాం
- నిరుపేదల సొంతింటి కల సాకారం చేస్తున్నాం
- దరఖాస్తు ఫీజు 50 రూపాయలు కూడా నేనే చెల్లిస్తా
- పూర్తి ఉచితంగా ఇళ్ల క్రమబద్ధీకరణ
- రెవెన్యూ సదస్సులో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : జీవో నంబర్ 31 నిరుపేదలకు వరమని, ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇళ్లపై హక్కులు కల్పిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక ప్రగతి నగర్ లో జీవో నంబర్ 30పై అవగాహన కల్పించేందుకు బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సుభానితో కలిసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్ద కాలంపాటు నివాసాలు ఉంటున్న నిరుపేదలు తమ ఇళ్లపై హక్కులు పొందబోతున్నారని, ఇదంతా సీఎం చంద్రబాబు నాయుడు మంచి మనసుకు నిదర్శనమని చెప్పారు. ప్రగతినగర్, యానాది కాలనీలో సుమారు 1300 ఇళ్లకు పైగా క్రమబద్ధీకరణ చేయబోతున్నామని వెల్లడించారు.
దీనికి సంబంధించి దరఖాస్తు ఫీజు ఒక్కొక్కటి 50 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. అయితే ఆ రుసుమును తానే భరిస్తానని ఈ సందర్భంగా నిరుపదెదలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతి లబ్ధిదారునికి మేలు చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రగతి నగర్ ను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని,, ఏడాది కాలంలోనే రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. గత గతంలో ఈ కాలనీలో అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ కు ఏ ఒక్కరికీ రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పేద పిల్లలు చదువుకునేందుకు తల్లికి వందనం ద్వారా అందరి పిల్లలను చదివిస్తున్నామని, స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణం మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. అందుకే ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ యాల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు బట్ట రాజా, అల్లం బాజీ, ఐల శ్రీను, మాదాసు శేఖర్, జడ సురేష్, కొండలు, కొలగాని సుబ్బారావు, బట్ట ప్రసాద్, పసుపులేటి సైదా, ఖతిజ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# యర్రబాలెం వినాయక నిమజ్జన ఊరేగింపులో ఉద్రిక్తత

- కలకలం రేపిన పోలీస్ నోటీసుల ఫ్లెక్సీ
- పోలీసులకు-ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలతో వాగ్వివాదం
- పోలీస్ నోటీస్ ఫ్లెక్సీ తొలగింపుతో వాగ్వివాదానికి తెర
- డీజే.డప్పులు, తీన్మార్ లేకుండా బాణా సంచా కాల్పుల నడుమ వినాయక నిమజ్జన ఊరేగింపు



ట్రాక్టర్ పై మంగళగిరి రూరల్ పోలీసులు ఇచ్చిన నోటీసు ఫ్లెక్సీ

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** వినాయక చవితి పండుగ సందర్భంగా మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెంలో శ్రీ బాబా గణేష్ యూత్ ఆధ్వర్యంలో వినాయకుని గుడి వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన ఊరేగింపు బుధవారం రాత్రి ప్రారంభమైంది. అంతక ముందు ట్రాక్టర్ పై గణేష్ విగ్రహాన్ని అధీష్టింపజేసి రంగుల పూల మాలలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
కాగా వినాయక నిమజ్జన ఊరేగింపులో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మంగళగిరి రూరల్ పోలీసులు ఇచ్చిన నోటీస్ ను ఫ్లెక్సీ గా తయారు చేయించి ట్రాక్టర్ పై ఉంచారు. దీంతో పోలీసులకు, ఉత్సవ కమిటీ ప్రతినిధులకు, గ్రామ పెద్దలకు వాగ్వివాదం చోటు చేసుకుంది. వినాయక చవితి సందర్భంగా ఏ ఒక్క విగ్రహ ఊరేగింపులో లేని నిబంధనలు తమ విగ్రహ ఊరేగింపుకు విధించడం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 90 శాతం విగ్రహాల ఊరేగింపులో డీజేలు పెట్టారని, తమకు కనీసం తీన్మార్, డప్పులకు కూడా అనుమతి ఇవ్వకపోవడం ఏమిటని వాపోయారు. వినాయక నిమజ్జన ఊరేగింపు భక్తి భావంతో.....పోలీసుల నిబంధనల మేరకే నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. వినాయక విగ్రహానికి ఎంతో మంది దాతలు చందాలు ఇచ్చారని, వారందరికీ పోలీసులు ఇచ్చిన నోటీసులోని అంశాలు తెలియజేసేందుకే ట్రాక్టర్ పై ఫ్లెక్సీ ని ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. చట్టాన్ని గౌరవిస్తూ వినాయక నిమజ్జన ఊరేగింపు నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకోవడం తగదన్నారు. ట్రాక్టర్ పై నోటీస్ ఫ్లెక్సీని తొలగించే వరకూ వినాయక నిమజ్జన ఊరేగింపు ను అనుమతించలేదని పోలీసులు తేల్చి చెప్పారు. దీంతో ఉత్సవ కమిటీ సభ్యులు ప ఫ్లెక్సీ నోటీసును తొలగించడంతో వినాయక నిమజ్జనోత్సవం ప్రారంభం కావడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

# సమాజానికి వెన్నెముక కులంగా వడ్డెరలను తీర్చిదిద్దిన జగన్

- అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్ బాబు



**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో వడ్డెరలను వెనుకబడిన కులంగా కాక యావత్ సమాజానికి వెన్నెముక కులంగా మార్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందని అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లపు మహేష్ బాబు స్పష్టం చేశారు. ఓవైపు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా వడ్డెరలను అన్ని రంగాలలో బలోపేతం చేసినట్లు ఆయన చెప్పారు. మరోవైపు రాజకీయంగా సముచిత వాటా కల్పించినట్లు ఆయన వెల్లడించారు.
విజయవాడలోని ఐలాపూర్ హోటల్లో జరిగిన ఒక కార్యక్రమంలో అఖిలభారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా పల్లపు మహేష్ బాబు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.
అనంతరం గుంటూరులో పల్లపు మహేష్ బాబు మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా వైయస్ జగన్, అట్టడుగు వర్గాల అభివృద్ధిని ఆచరణలో చేసి చూపడమే కాక బీసీలు, ముఖ్యంగా వడ్డెరలు తమ తలరాతలు తామే మార్చుకునే విధంగా వ్యవస్థలలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చారని తెలిపారు. ఓట్ల కోసం వాడుకోబడే కులాలుగా కాదు ఓటింగుని శాసించే కులాలుగా.. అధికారం కోసం అణగతొక్కబడే కులాలుగా కాదు, అధికారం పొందే కులాలుగా.. కులవృత్తులకు పరిమితమైన కులాలుగా కాదు, సమాజాన్ని నడిపించే కులాలుగా తమను తీర్చిదిద్దిన జగన్‌కు వడ్డెర జాతీయులంతా జన్మజన్మలకు రుణపడి ఉంటారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా తాను వడ్డెరల అభ్యున్నతికి కట్టుబడి, తిరిగి వైయస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడమే ధ్యేయంగా కృషి చేస్తానని పల్లపు మహేష్ బాబు ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుంజు శీను, జాతీయ మహిళా కార్యదర్శి వేముల తిరుమల దేవి, రాష్ట్రంలోని పలువురు జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# పాతమంగళగిరి హిందూశ్మశానవాటికకు సరికొత్తరూపు

- మంత్రి నారా లోకేష్ ఆలోచనలకు ప్రతిరూపంగా మహాప్రస్థానం
- చురుగ్గా జరుగుతున్న నిర్మాణ పనులు
- త్వరలో తాడేపల్లిలోనూ ఇదేతరహాలో మహాప్రస్థానం!



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర మానవవనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గం దేశంలోనే ఓ మోడల్ గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా.. అక్కడ వున్న వసతులను గమనిస్తూ.. మంగళగిరి నియోజవర్గానికి అన్వయించు కుంటారు. ఏమాత్రం అవకాశంవున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదు. అంతగా మమేకమయ్యారు... మంగళగిరితో.. ప్రధానంగా మంగళగిరి నియోజకవర్గంలో శ్మశానవాటికల్లో పరిస్థితులు దారుణంగా వుండడంతో వాటిని చక్కదిద్దేందుకు నడుంకట్టారు మంత్రి నారా లోకేష్. ఇప్పటికే సొంత నిధులతో వడ్డేశ్వరం గ్రామంలో 8 శ్మశానవాటికల్లో మౌలిక సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గంలో దాదాపు 100కుపైగా శ్మశానవాటికల రూపురేఖలు మారిపోయేలా సొంతనిధులతో ఆధునిక వసతుల కల్పనకుగాను చర్యలు తీసుకోగా... ఇప్పటికే కొన్ని పూర్తికాగా... మరికొన్ని వివిధ దశల్లోవున్నాయి. మరీముఖ్యంగా పాతమంగళగిరిలోని హిందూశ్మశానవాటికను చూస్తే ఆ పరిసరాలకే వెళ్లాలనిపించదు. అంతఘోరంగా వుందీ శ్మశానవాటిక. దీంతో మంత్రి నారా లోకేష్ పాత మంగళగిరిలోని హిందూశ్మశానవాటికకు సరికొత్తరూపు తీసుకువచ్చేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఆ మేరకు ఫీనిక్స్ గ్రూపు నుంచి 3 కోట్ల సీఎస్ ఆర్ నిధులు మంజూరుచేయించారు. ప్రస్తుతం పాతమంగళగిరిలోని హిందూశ్మశానవాటిక పునఃనిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పుడిక్కడ కడుతున్న శ్మశానవాటిక పూర్తయితే మన వూరేనా... మన వూళ్లో మహాప్రస్థానం ఇంత అద్భుతంగా వుందా అంటే ఆశ్చర్యపోవడమే కాదు.. మనం గొప్పగా చెప్పుకునే రోజులు ఎంతోదూరంలో లేవు.

**మహాప్రస్థానం ప్రత్యేకతలు...**

సుమారు రెండెకరాల స్థలంవున్న పాతమంగళగిరి హిందూ శ్మశానవాటికలో పునఃనిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫీనిక్స్ ఫౌండేషన్ దాతృత్వం, సామాజిక కారణాలపై దాని ఆలోచనాత్మక, ఆవిష్కరణ విధానం ఎందరో ప్రశంసలు అందుకుంది. ఈ ఫీనిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పాతమంగళగిరిలోని హిందూ శ్మశానవాటిక పునఃనిర్మాణ పనులు పూర్తయితే భూతల స్వర్గాన్ని తప్పక తలపింపజేస్తుందీ మహాప్రస్థానం. ఇందులో కల్పిస్తున్న సదుపాయాలు... నాలుగు చితులు... ఎదురుగా వేచి ఉండే గదులు, అన్నదానం హాల్, వాష్ రూమ్‌లు (పురుషులు మరియు స్త్రీలు), మార్చురీ, విస్తారమైన వాహన పార్కింగ్, చెక్క నిల్వ స్థలం, కర్మ(పూజ) గదులు, పక్షులకు ఆహారమిచ్చే స్థలం, అందమైన ల్యాండ్ స్కేపింగ్, అంతర్గత రోడ్లు మొదలైనవి రూపుదిద్దుకుంటాయి. ఈ శ్మశానవాటిక పర్యావరణానికి అనుకూలమైనదే కాకుండా కుటుంబాలు తమ ప్రియమైనవారికి గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు చెప్పాలనే లక్ష్యంతో పరిశుభ్రమైన, ఓదార్పునిచ్చే ప్రదేశంగా తీర్చిదిద్దుతారు.
ఇక పాతమంగళగిరి హిందూశ్మశానవాటిక కొత్తరూపు దాల్చాక.. ఏ సంకోచం లేకుండా తమ ప్రియమైనవారికి గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలు పలికేందుకు తప్పకుండా మహాప్రస్థానం వరకు విచ్చేస్తారు. అంతగా మహాప్రస్థానం రూపుదిద్దుకుంటుంది.

# దోమలద్వారావ్యాపించువ్యాధులపై అప్రమత్తంగా " ఉండాలి



**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** పురపాలక సంఘ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మొవ్వ ఏసుబాబు పట్టణంలోని 17వ వార్డు అలీఖాన్ వీధి, కావేటివారి వీధి, మసీదుఎదురు సందు ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యేకపారిశుధ్య పనులను మలేరియా సిబ్బందితో కలిసి పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణపై శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. ఆయా ప్రాంతాల్లో మురునీటి కాలువలు శుభ్రం చేయించుట కాలవులలో దోమల నివారణకు యాంటీ లార్వాస్ప్రేయింగ్ చేయించి, దోమల ద్వారా వచ్చు వ్యాధులపై అవగాహన కలిగించు కరపత్రములను పంపిణీ చేయించడం జరిగినది. కాలువలలో చెత్తాచెదారం వేయవద్దని, తద్వారా మురుగునీటిపారుదలకు ఆటంకం ఏర్పడి దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని స్థానికులకు తెలియజేశారు. ఇంటి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పోలకుండీలు పనికిరాని టైర్లు కొబ్బరి బోండాలు రోడ్లు వంటి వాటిలో నీరు నిలవ ఉంటే దోమల లార్వా తయారవుతుందని తద్వారా దోమల ఉద్భృతి పెరుగుతుందని తద్వారా మలేరియా డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలుతాయని ప్రజలకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పట్టణ మలేరియాసబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారిఅందెబాలచంద్రమౌళి, శానిటరీ సెక్రటరీ గుమ్మడిప్రవీణా కుమారి, శానిటరీసూపర్వైజర్ మేకా సురేంద్రబాబు, మలేరియా హెల్త్ అసిస్టెంట్స్ సయ్యద్ కరిముల్లా, ఆలా వేణుగోపాలరావు, సంకాశరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# జిఎస్‌టి తగ్గింపు హర్షణీయం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ పేదల పక్షపాతి అని దేశ వ్యాప్తంగా జి ఎస్ టి తగ్గింపు హర్షణీయం అని బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ,రైతాంగానికి ఉపయోగకం మన్నారు.
అదే విధంగా నూతనంగా ఎన్నికైన ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. స్థానిక బీజేపీ నాయకులు వెంకట లక్ష్మి, ఆదిలక్ష్మి, శ్రీధర్ శర్మ, రాం గోపాల్, సజ్జనరావు పలువురు నాయకులు నూతన ఉప రాష్ట్ర పతి కు అభినందనలు తెలియజేశారు.

# సోలార్ టెక్నాలజీలో మహిళలకు శిక్షణ



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను పెంపొందించేందుకు నిర్మల ఫార్మసీ కళాశాల ఉమెన్ సెల్, వాసవ్య మహిళా మండలి సంయుక్తంగా ముందుకొచ్చాయి. ఈ క్రమంలో 14 రోజుల సోలార్ ప్యానెల్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమం మంగళవారం కళాశాల ప్రాంగణంలో ప్రారంభమైంది.

**సాంకేతిక రంగంలో మహిళలకు అవకాశాలు**

ప్రస్తుత కాలంలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం పెరుగుతుందని, ఈ రంగంలో మహిళలకు మరిన్ని అవకాశాలు సృష్టించడం లక్ష్యమని ముఖ్య అతిథులు అభిప్రాయపడ్డారు. డా. బొల్లినేని కీర్తి మాట్లాడుతూ "మహిళలు నూతన టెక్నాలజీలలో ముందంజ వేయడం సమాజ అభివృద్ధికి మేలు చేస్తుంది" అన్నారు. సిస్టర్ జి. నిర్మల జ్యోతి "సోలార్ రంగంలో మహిళలకు ఈ శిక్షణ ఒక కొత్త దారిని చూపుతుంది" అని పేర్కొన్నారు. ట్రైనర్ రాబర్ట్ జేమ్స్ "ప్రాక్టికల్ శిక్షణ ద్వారా మహిళలు టెక్నీషియన్లుగా రూపుదిద్దుకుంటారు" అన్నారు.

**45 మంది మహిళలకు శిక్షణ**

ఈ కార్యక్రమంలో 45 మంది మహిళలు పాల్గొనగా, వారిలో చాలా మంది గ్రామీణ ప్రాంతాల నుంచే వచ్చారు. ఉమెన్ సెల్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ ఎనర్జీ సేవర్స్ క్లబ్ విద్యార్థి కోఆర్డినేటర్లు చురుకుగా వ్యవహరించారు.

**గ్రీన్ ఎనర్జీ మిషన్‌లో భాగస్వామ్యం**

ఈ శిక్షణ ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు దేశ గ్రీన్ ఎనర్జీ మిషన్‌లో మహిళల పాత్ర మరింత బలపడుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

# డిప్యూటీ సిఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉంది ? : హైకోర్టు

**అమరావతి** : ప్రభుత్వ కార్యాలయాల్లో డిప్యూటీ సిఎం ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉంది ? అని ఎపి హైకోర్టు ప్రశ్నించింది. ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫొటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్ పై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా.. డిప్యూటీ ముఖ్యమంత్రి ఫొటో ఏర్పాటుపై నిషేధం ఎక్కడ ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో పిటిషన్ వేశారని పేర్కొంటూ పిల్‌ను డిస్మిస్ చేసింది. సమాజానికి పనికొచ్చే ప్రజాహిత వ్యాజ్యాలు దాఖలు చేయాలని కోర్టు సూచించింది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# వ్యవసాయ శాఖ, రైతాంగం అభివృద్ధిపై జగన్ ఓపెన్ డిబేట్‌కి సిద్ధమా?

- సవాల్ విసిరిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులను రాష్ట్ర ప్రజలముందు బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం
- జగన్ పాలనలో రైతులు నరకం చూశారు
- కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేయడం విచిత్రంగా ఉంది
- రైతు పేరు చెప్పడానికి జగన్ అర్హుడు కాదు.. రైతు కష్టాన్ని దోచుకొని, రైతు కన్నీటి మీద రాజకీయాలు చేసిన వ్యక్తి జగన్
- వైసీపీ పాలనలో రైతాంగాన్ని మోసం చేసి, నేడు తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న జగన్
- కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో రైతుల పక్షాన నిలుస్తుంది... రైతు కష్టం వృథా కాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్) :** రైతాంగం అభివృద్ధి, వ్యవసాయ శాఖలో చేసిన సంస్కరణలు, రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా? అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైసీపీ అధినేత జగన్‌కు సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం రైతుల కోసం ఏం చేస్తుందో, వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులు ఏవో రాష్ట్ర ప్రజలముందు బహిర్గతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు మోసపూరిత వాగ్దానాలు తప్ప ఇంకేమీ ఇవ్వలేదని, మద్దతు ధరలు కోత పెట్టి, ఇన్సూరెన్స్ డబ్బులు ఆపేసి, పంటలు అమ్మకానికి రాకుండా చేసిన వైసీపీ వైఫల్యాలను ప్రజలు మరచిపోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు తోడుగా నిలబడి విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు పూర్తి సహకారం అందిస్తోందని అన్నారు. ఎరువులు, విత్తనాలు సమయానికి అందిస్తూ, పంటలకు రుణ సౌకర్యం కల్పిస్తూ, రైతు కుటుంబాలను రక్షించేలా పథకాలను అమలు చేస్తోందన్నారు. దీనిపై ధైర్యం ఉంటే జగన్ పబ్లిక్ డిబేట్‌కు రావాలని సవాల్ విసిరారు. ఎవరికి రైతుల పట్ల నిజమైన నిబద్ధతుందో ప్రజలే తీర్పు చెబుతారు అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

రైతాంగానికి ఊరట కల్పించే విధంగా అద్భుతమైన నిర్ణయాలు తీసుకుంటూ, ఎరువుల సరఫరా, పంట కొనుగోళ్లు, మద్దతు ధరలు, రుణమాఫీ వంటి కీలక అంశాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్న కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు చేయడం విచిత్రమని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, తన ఐదేళ్ల పాలనలో రైతాంగాన్ని మోసం చేసి, నేడు తప్పుడు ఆరోపణలు చేసి మళ్లీ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు సంక్షేమం అంటే జగన్ కు ఏమాత్రం పట్టులేదని ఆయన పాలనలోనే స్పష్టమైందన్నారు. ఎరువుల కొరత, నల్లబజారు, కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యం, పంట బీమా చెల్లింపులలో మోసాలు ఇవన్నీ జగన్ పాలనలోనే జరిగాయని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల కోసం రాత్రింబవళ్ళు శ్రమిస్తుంటే, జగన్ మాత్రం ప్రతిదాన్నీ కుతంత్రం చేసి అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రైతుకు అందుతున్న ప్రతి సహాయం జగన్ కంటకంగా మారిందని మంత్రి అన్నారు.

ధరల స్థిరీకరణ నిధి పేరుతో 3 వేల కోట్లు ఏర్పాటు చేశామని, 7,800 కోట్లు ఖర్చు పెట్టామని జగన్ చెబుతున్నారు. అసలు మార్కెట్‌లో ధరలు పడిపోకపోయినా 7,800 కోట్లు ఎక్కడికి పోయాయి? రైతులకు ఒక్క పైసా ఉపయోగం లేకుండా ఆ డబ్బు ఎవరెవరి జేబుల్లోకి వెళ్లింది? ఇవన్నీ పచ్చి అబద్ధాలు. వైసీపీ హయాంలో రైతుల ఉత్పత్తుల కొనుగోలు అనే మాటే లేదు. నిజంగా కొనుగోలు చేసి ఉంటే ఏ రైతు నుండి, ఏ పంటను, ఏ ప్రాంతంలో కొనుగోలు చేశారో కాగితాలతో చూపించగలరా? లేకపోతే అబద్ధాల గజిబిజి నుంచి బయటపడగలరా?" అని సవాల్ విసిరారు. HD బర్లీ పొగాకు ధర పడిపోతే 271 కోట్లు వెచ్చించి 20,000 మిలియన్ కిలోలు కొనుగోలు చేసేందుకు నిర్ణయించి, ఇప్పటికే 16,000 మిలియన్ కిలోలు కొనుగోలు చేసామని తెలిపారు. ఇంకా మిగిలిన 4000 మిలియన్ కిలోలను కూడా కొంటామని, ఇంకో 60వేల మిలియన్ కిలోలను ప్రైవేట్ వర్తకుల ద్వారా కొనుగోలు చేయించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి 3 సందర్భాలలో టొమాటో ధర పడిపోతే, 4599 మెట్రిక్ టన్నుల టొమాటో పంటను కొనుగోలు చేసి 11.25 కోట్లు రైతులకు చెల్లించామని అన్నారు.



ఉల్లి ధరల విషయంలో మీరు మొసలి కన్నీరు కారుస్తున్నారు. మా ప్రభుత్వం మద్దతు ధరగా రూ.1200 ప్రకటించింది. ఈనాడు పత్రికలో వెలువడింది. కానీ మీరు ఒకవైపు రూ.1200 మద్దతు ధర అని చెబుతారు, మరోవైపు రూ.300కే కొనుగోలు జరుగుతోందని అంటారు... అసలు మద్దతు ధర విధానం మీకు తెలుసా? తెలుసుకునే తెలివి ఉన్నదా? మద్దతు ధర కన్నా మార్కెట్ లో అమ్ముడుపోయినటువంటి విలువ తగ్గితే ఆ వ్యత్యాసాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. మార్కెట్ లో 300 రూ ట్రేడ్ అయితే మిగతా 900రూ ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ ప్రాథమిక జ్ఞానం కూడా లేని మీరు అసలు మాజీ ముఖ్యమంత్రివేనా?" అని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో రైతుల ధాన్యం కొనుగోలు చేసినా డబ్బులు ఇవ్వలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయి పడ్డ నగదును రైతులకు అందచేశామని, రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, 24 గంటల్లోపే నగదు రైతుల ఖాతాల్లో జమ చేసిన ఘనత మాది అని మంత్రి గుర్తుచేశారు. 2016లో ఉల్లి ధరలు పడిపోతే 7723 మంది రైతులనుండి 2.77 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసి 7కోట్ల రూపాయలు రైతులకు చెల్లించామని అన్నారు. 2018లో మరొక సారి 9740 మంది రైతుల నుండి 3.48 లక్షల క్వింటాళ్ళ ఉల్లి కొనుగోలు చేసి 6.45 లక్షలు చెల్లించామని, 2020 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వంలో ఉల్లి ధరలు పడిపోతే, నామ మాత్రంగా క్వింటాకి రూ.770/-లు మద్దతు ధర ప్రకటించి, ఏ ఒక్కరి దగ్గరా ఉల్లి కొనుగోలు చేయకుండా, రైతులను మోసం చేసారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం క్వింటాకి రూ.1200/-లు మద్దతు ధర ప్రకటించి, ఇచ్చిన మాటకు కట్టుబడి, అదే ధరకు ఉల్లి కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

కోకో ధరలు పడిపోతే 3776 మంది రైతుల నుండి కేజీకి రూ.50/-అదనంగా ఇచ్చి కొనుగోలు చేసాము. ఇందుకు గాను 11.8 కోట్లు చెల్లించాము. తోతాపురి మామిడి ధర పడిపోతే, 51వేల మంది రైతుల నుండి 4.3 లక్షల టన్నుల మామిడి కొనుగోలు చేసి కేజీకి రూ.4/-లు చొప్పున 171 కోట్లు చెల్లించాము. గత సంవత్సరం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మిర్చీకి క్వింటాకి రూ.11,781/-లు మార్కెట్ జోక్యపు ధరను కల్పించాము. ప్రభుత్వం నుండి హామీ లభించటంతో మార్కెట్లో మిర్చీ ధర స్థిరీకరించబడి రూ.11,781/-లు కంటే అధికంగా ట్రేడ్ అయింది. దీంతో %వీ×ూ% పథకం అమలు చేయాల్సిన అవసరం రాలేదు. 2017లో మిర్చీ ధరలు పడిపోతే ప్రభుత్వం 55 వేల మంది రైతులకు క్వింటాకి రూ.1500/- చొప్పున 130 కోట్లు చెల్లించాము. అదే మీ ప్రభుత్వం హయాంలో 2020 సంవత్సరంలో మార్కెట్ ధర 12000/-లు ఉంటే మద్దతు ధర రూ.7000/-లు ప్రకటించి కొనడానికి ఒక్క పైసా కూడా కేటాయించలేదు. ఒక కార్పొరేట్ సీఎంకి సామాన్యుని తాలూకా కష్టాలు , సామాన్యులు ఉపయోగించే వస్తువుల తాలూకా రేట్లు తెలియాలి అనుకోవడం హాస్యాస్పదం. ఉల్లి ధర పడిపోయింది బహిరంగ మార్కెట్లో కేజీ 34 రూపాయలు ఉందని, ధనవంతులు ఉపయోగించే బిగ్ బాస్కెట్ లో ధరలు కనిపిస్తున్నాయి గాని సామాన్యుడు వాడేటటువంటి రైతు బజార్లో ఈ రోజు ఉల్లి ధర ఎంత ఉందనేది మాట్లాడి ఉంటే ప్రజలు సంతోషించేవారు.

కేంద్ర ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని చెప్పటం వలన పక్క రాష్ట్రాలలో యూరియా కొరత వలన పలు రాష్ట్రాలలో ఆందోళనలు చేయడం వలన ఏపీలో కూడా యూరియా దొరకదని భయంతో మూడు సీజన్లకు వాడాల్సిన యూరియాను ఒకే సారి రైతులు కొనుక్కోవాలి అన్న అభద్రతాభావం, యూరియా దొరకటం లేదని ఫేక్ ఫోటోలు పెట్టి రైతులు అదే నిజమనుకొని రబీ సీజన్ కు కావల్సిన యూరియాను ముందుగానే కొనుక్కోవాలని భయాన్ని వైసీపీ నేతలు సృష్టించారు. ఇటీవల ఒక నెల డ్రై స్పెల్ రావడం తరువాత విస్తారంగా ఒకే సారి వర్షాలు కురవడం వలన ఆగస్ట్ నెలలో ఒకే సారి రాష్ట్ర వ్యాప్తంగా వరి పంటను వేయడంతో ఒక 10 రోజులు రైతులు యూరియా దొరకదని భయభ్రాంతులకు గురయ్యేలా వైసీపీ వారు వాతావరణాన్ని సృష్టించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రానికి రావలసిన కేటాయింపు యూరియా కంటే అధిక మొత్తంలో అదనంగా యూరియాను కేటాయించుకొని జిల్లాలకు సరఫరా చేసి రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాం. నేటికి యూరియా కొరత తీరిపోయింది. రబీ సీజన్ కు కావల్సిన 9.3 లక్షల మెట్రిక్ టన్నులను ముందస్తుగానే సిద్ధం చేసుకోవడం జరుగుతుంది. ఎరువులను బ్లాక్ మార్కెట్ కు తరలించే ఉద్దేశం కూటమి ప్రభుత్వానికి లేదు, గతంలో వైసీపీ నేతలు బ్లాక్ మార్కెట్ కు యూరియాను తరలించడంతో అందరూ అదే విధంగా వ్యవహరిస్తారని భావించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అని అన్నారు.

ఈ ప్రభుత్వ కాలంలో సహకార సంస్థలకు 70 % , ప్రైవేట్ వ్యాపారులకు 30 % యూరియాను కేటాయింపులు జరిపాం. గత ప్రభుత్వంలో 50-50 శాతం నిష్పత్తిలో యూరియాను పంపిణీ చేసి బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహించారని దుయ్యబట్టారు. ఆర్‌ఎస్కేలు మీ ప్రభుత్వంలో ఉన్న దాని కంటే ఈ ప్రభుత్వంలోనే ఆర్‌ఎస్కేలు ద్వారా పిఎసిఎస్ ద్వారా అధికంగా ఎరువులు వీటి ద్వారా అమ్మకాలు చేయడం జరిగింది. గత ప్రభుత్వంలో ప్రైవేట్ వ్యాపారుల దగ్గర లంచాలు తీసుకొని ఉంటారని, మీ సమయం లో కన్నా ఈ ప్రభుత్వ సమయంలోనే ఆర్‌ఎస్కే ల ద్వారా పిఎసిఎస్ ల ద్వారా అధికంగా ఎరువులు సప్లై చేసామన్న విషయాన్ని గ్రహించి మాట్లాడితే మాట్లాడితే మాజీ సీఎం జగన్ కు గౌరవం దక్కేది అని అన్నారు. పంట నష్టం వస్తే సీజన్ లోపే ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం ఇప్పించడం జరిగిందని మాట్లాడుతున్నారు ఈ రోజు క్రాప్ ఇన్సూరెన్స్ విషయంలో ఇన్ని అస్తవ్యస్తమైనటువంటి పరిస్థితులు వచ్చాయంటే మీరు తీసుకున్నటువంటి నిర్ణయాలే కారణం. అన్నదాత సుఖీభవ పథకానికి 7 లక్షల మందిని తగ్గించాం అని అంటున్నారు, అర్హులైన ప్రతి ఒక్కరికి అన్నదా సుఖీభవ ద్వారా నగదును అందచేశాం.

మిగిలిన వారికి తిరిగి ఇచ్చేందుకు ప్రక్రియ కొనసాగుతుంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి రాని కౌలు రైతులు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం 20 వేలు అందచేస్తుదన్న విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు. లాస్ట్ లో 2019 తరువాత ఏ ఒక్క సంవత్సరానికి రభి కి ఇన్స్యూరెన్స్ ఇవ్వలేదు . 2022 -23 ఖరీఫ్ తరువాత ఖరీఫ్ కి ప్రీమియం కట్టకుండా ఎగనామం పెట్టి రైతులని జగన్ మోసం చేశాడు.

రాష్ట్రంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమంగా తరలిస్తున్న యూరియాను కట్టడి చేసి, నిందితులను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేస్తున్నామని... ఆయా చిత్రాలను తన సొంత పత్రికలో వేసుకొని ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేయడం విచిత్రంగా ఉందన్నారు. సీఎం చంద్రబాబు పారదర్శకంగా ఎరువులు పంపిణీ జరిగేలా చర్యలు చేపడుతుంటే అబద్ధపు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవడం జగన్ వంకర బుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలు నిన్న చేపట్టిన అన్నదాత పోరులో రైతులే లేరని, రైతులు జగన్ ను, వైసీపీ ని మర్చిపోయారని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని, ఎవరైనా ఏ విషయంపైనా ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు బనాయించి జైల్లో వేయడం, లేదా విచక్షణారహితంగా దాడులు చేయడం ఆ కారణంచే ఎవరు బయటకు వచ్చి వారి గొంతును వినిపించుకునే వారు కాదని, నేడు స్వేచ్ఛగా ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు తూచా తప్పకుండా అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలనను చూసి తట్టుకోలేక కుళ్లి కుళ్లి ఏడుస్తున్న జగన్ హంద్రీ-నీవా కాలువలో దూకితే వైసీపీ కి మోక్షం లభిస్తుందని అన్నారు.

## జీఎస్టీ రేట్లు తగ్గించిన ప్రధాని నరేంద్ర మోడీకి పాలాభిషేకం



- బిజెపి జిల్లా అధ్యక్షులు తిరుపతిరావు

గుంటూరు జిల్లా బిజెపి అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు ఆధ్వర్యంలో జిఎస్టి రేట్లు తగ్గించినందుకు మరియు ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణ ఎన్నికలలో దాని విజయం సాధించినందుకు విజయోత్సవ ర్యాలీ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతి రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ దూర దృష్టి గల నాయకత్వంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి శ్రీమతి నిర్మా సీతారామన్ సమర్థవంతమైన చర్యలతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల పలు వస్తువులు సేవలపై జిఎస్టి తగ్గించే నిర్ణయం తీసుకోవడం ప్రజలకు గొప్ప ఊరట కలిగిస్తుందని జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతి రావు అన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల సామాన్య ప్రజలకు, వ్యాపారస్తులకు, పరిశ్రమలకు, మెడికల్ బీమా సంస్థలకు లబ్ధి పొందుతారని, అలాగే ప్రజలకు రోజువారి నిత్యవసర వస్తువులపై జిఎస్టి తగ్గించడం వల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం చేకూరుతుందని, చిన్న మధ్యతరగతి వ్యాపారస్తులకు పన్నుల భారంలో ఉపశమనం లభిస్తుందని అన్నారు. తయారీ రంగం ఉత్పత్తి ఖర్చులు తగ్గి పోటీ సామర్థ్యం పెరుగుతుందని దీని వల్ల ద్రవయోల్బనం నియంత్రణలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం కీలకం అవుతుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రజలపై ఏవిధంగా అభిమానం ఉన్నదో తగ్గించిన ఈ పన్నుల విధానాన్ని చూస్తేనే మనకు అర్థమవుతుంది అని అన్నారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ కృషివల్ల ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. జీఎస్టీ రేట్లు తగ్గించడం వలన పెట్టుబడులు పరిశ్రమలు పెరిగి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రజలకు కూడా ఈ నిర్ణయం వల్ల నేరుగా లబ్ధి చేకూరుతుందని , ప్రజల సంక్షేమమే ప్రధాన సేవ అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు మరొక్కసారి ఈ నిర్ణయంతో నిరూపించుకున్నారని అన్నారు..

ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణ సాధించిన విజయం కాంగ్రెస్ కూటమి కలల్ని కొల్లగొట్టింది. ఈ విజయం నరేంద్ర మోడీ నాయకత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసం అద్దం పడుతుందని అన్నారు

ఈ సందర్భంగా గుంటూరులో విజయోత్సవ ర్యాలీ బ్రాడీపేట సింధూరి హోటల్ నుండి శంకర విలాస్ సెంటర్ వరకు నిర్వహించారు. ర్యాలీ అనంతరం టపాసులు కాల్చి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనం శ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇన్చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, ఈదర శ్రీనివాస్ రెడ్డి,పాలపాటి రవికుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వెలగలేటి గంగాధర్, చరక కుమార్ గౌడ్,.వై. వి. సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బజరంగ్ రామకృష్ణ,దేసు సత్యనారాయణ, శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు,జిల్లా ఉపాధ్యక్షులు వంగివరపు విమల దేవి,కత్తి మేరీ సరోజిని, కార్యదర్శులు క్రిష్టిపాటి నారాయణరెడ్డి, నారదాసు వీరమణి,సురేష్ జైన్, దానబోయిన శివయ్య, మోర్చా అధ్యక్షులు నడ్డి నాగమల్లేశ్వరి యాదవ్, ధార అంబేద్కర్, మండల అధ్యక్షులు గాయత్రీ బెహరా, తంగా లక్ష్మణరావు, పాలెం వెంకట పుల్లారావు, మల్లాల లక్ష్మణ్ గౌడ్, కంచర్ల రాజేష్ నాయకులు అనుమోలు ఏడుకొండల గౌడ్, బూసి స్టాలిన్, జితేంద్ర గుప్తా, పురుషోత్తం, కోలా రేణుకాదేవి, దుర్గా ప్రసాద్, సాంబయ్య గౌడ్, కామేపల్లి వెంకటేశ్వర్లు, రామచంద్ర రావు, శోభన్ బాబు,కొర్రా శ్రీను నాయక్, ప్రతాప ప్రసాద్, ప్రవీణ్,రమణ,సాయి, యస్వంత్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాప్రయోజన ఆవిష్కణల శాస్త్రవేత్తలు జనహృదయ నేతలు

- తమిళనాడుగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- డాక్టర్ నాయుడమ్మ స్మారక అవార్డు గ్రహీత, కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు మద్దిరాల



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ )** శాస్త్రవేత్తలు సెమినార్లకు పరిమితం కాకుండా ప్రజల్లోకి వెళ్ళాలని ప్రజా ప్రయోజన ఆవిష్కరణలకు, ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా శాస్త్రవేత్తలు నాయుడమ్మ వలె ప్రజల హృదయాల్లో ఉంటారని, తమిళనాడు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డాక్టర్ నాయుడమ్మ స్మారక అవార్డు ప్రధానోత్సవ సభలో, ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు.

స్థానిక కొత్తపేటలోని రామకృష్ణకవి కళాక్షేత్రం వేదికగా, బుధవారం డాక్టర్ యలవర్తి నాయుడమ్మ 104వ, జయంతి సంద్భంగా,ఏర్పాటుచేసిన, నాయుడమ్మ స్మారక అవార్డు ప్రధానోత్సవ సభ ఆద్యాంతం ప్రాధాన్యతను సంతరించుకుంది. నాయుడమ్మస్మారక సైన్స్ టెక్నాలజీ ఫౌండేషన్ చైర్మన్ యడ్లపాటి రఘునాదబాబు అద్యక్షత వహించిన సభలో,తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజుకు నాయుడమ్మ స్మారక అవార్డును ప్రధానం చేశారు. జ్యోతి ప్రజ్వలన తో ప్రారంభమైన కార్యక్రమంలో, వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. సభాధ్యక్షులు యడ్లపాటి రఘునాథ బాబు నాయుడమ్మ జీవిత విశేషాలను,శాస్త్రవేత్తగా, ఆయన సాధించిన విజయాలను వివరించారు. పి విష్ణుమూర్తి, నాయుడమ్మ అవార్డు, కార్యక్రమాలకు తమకు స్ఫూర్తి అన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తమ ప్రసంగంలో నాయుడమ్మ అవార్డు గ్రహీత, నాగరాజు తో, తమకున్న అనుభవాలను వివరించారు. నాగరాజు వివిధ విభాలకు అధికారిగా, ఎన్నో సవాళ్లను అధిగమించారని, డాక్టర్ నాయుడమ్మ అవార్డుకు నిర్వహకులు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు గ్రహీత కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి మద్దిరాల నాగరాజు తమస్పందన తెలియజేస్తు, జీవితంలో కొన్నిక్షణాలు జీవిత కాలం గుర్తుండిపోతాయని, అటువంటి క్షణాలను తాను అనుభవిస్తున్నానని అన్నారు. నాయుడమ్మ అవార్డు తీసుకోవడం అరుదైన గౌరవంగా భావిస్తున్నానని, ఈ అవార్డు ద్వారా తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. గతంలో ఎంతోమంది మేధావులు ఈ అవార్డును అందుకున్నారని, వారి సరసన నిలవడం గుర్తుండిపోయే అంశం అన్నారు. దూర దృష్టి గల శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మని, వారి పరిశోధనల ద్వారా అంతర్జాతీయ గుర్తింపు తో పాటు, ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు, తద్వారా గ్రామాలు సాంకేతికంగా అభివృద్ధి చెందడం శుభ పరిణామం అన్నారు. ఈవిశిష్ట సభా కార్యక్రమంలో లెదర్ టెక్నాలజీ శాస్త్రవేత్త స్వర్ణ వి కాంత్, కొత్త సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రిణి నన్నపనేని రాజకుమారి,మాజీ ఎమ్మెల్యే గోగినేని ఉమా, ఎడ్లపాటి స్వరూప రాణి, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్న ఈ సభలో, సైన్స్ టెక్నాలజీపై విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో, విజేతలకు తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. తొలుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పోలీస్ శాఖ తరపున గౌరవ వందనం స్వీకరించారు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పట్టణంలోని పలువురు బీజేపీ నాయకులు,అధికారులు, వివిధ వర్గాల ప్రముఖులు పాల్గొన్నారు.

## రాజకీయ నైర్యశ్యంతోనే మెడికల్ కాలేజీలపై దుష్ప్రచారం


- వైసీపీ అధినేత జగన్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డ మంత్రి సత్యకుమార్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అనంతపురంలో బుధవారం జరిగిన కూటమి ప్రభుత్వం 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభ నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నిర్వహించిన పత్రికా సమావేశం విష ప్రచారంతో నిండి ఉందని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను భారీ ఎత్తున అమలు చేస్తున్న నేపథ్యంలోనే జగన్ అసత్యాలకు దిగజారారని మంత్రి ఆరోపించారు.

**వైద్యకాలేజీలపై జగన్ దుష్ప్రచారం**

పిపిపి విధానంలో వైద్యకాలేజీల నిర్మాణంపై జగన్ వ్యాఖ్యలను మంత్రి సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. వైసీపీ పాలనలో మెడికల్ కాలేజీల నిర్మాణం విషయంలో జగన్ ద్వంద్వ వైఖరిని మంత్రి బహిర్గతం చేశారు.

నాలుగేళ్ల పాలనలో కేవలం ?1450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిన జగన్, కూటమి ఏడాదిలోనే ?7000 కోట్లు వెచ్చించాలంటూ విమర్శించడం



ఆశ్చర్యమని మంత్రి ఎద్దేవా చేశారు. 2023లో 150ఎంబిబియస్ సీట్లు ఇచ్చిన ఎన్ఎంసి, 2024-25లో పాడేరు కాలేజీకి కేవలం 50 సీట్లకే ఎందుకు పరిమితం చేసిందో జగన్ వివరించాలని మంత్రి నిలదీశారు. తగిన మౌలిక వసతులను జగన్ అందించకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని మంత్రి తేల్చి చెప్పారు..

**పులివెందులకు ప్రాధాన్యం - మిగిలినవాటికి వివక్ష**

పులివెందుల వైద్యకాలేజీకి 84 శాతం నిధులు కేటాయించగా, మార్కాపురం, మదనపల్లి, ఆదోని కాలేజీలకు కేవలం 15-17 శాతం మాత్రమే ఖర్చు చేయడం జగన్ వివక్షకు నిదర్శనమని మంత్రి ఎద్దేవా చేశారు. 2024-25లో 12 కాలేజీల్లో సీట్ల కోసం రూ.7,000 కోట్లు ఖర్చు చేయాలన్న పరిస్థితిని జగన్ తెచ్చిపెట్టారని మంత్రి ధ్వజమెత్తారు.

**ఆరోగ్య బీమాపై వక్రభాష్యం - పిచ్చికి పరాకాష్ట**

హైబ్రిడ్ విధానంలో రూ.25 లక్షల ఆరోగ్య బీమాపై జగన్ చేసిన వ్యాఖ్యలను మంత్రి సత్యకుమార్ "రాజకీయ నైరాశ్యం"గా వ్యాఖ్యానించారు. బీమా కంపెనీ ద్వారా రూ.2.50 లక్షల వరకు, ఆపై డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా రూ.25 లక్షల వరకు ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. జగన్ వక్రభాష్యం "పిచ్చికి పరాకాష్ట" అని మంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రజలు అసత్యాలను పట్టించుకోరు**

తన పాలనలో ఎంతో చేశానని డప్పు కొట్టుకున్నా 2024 ఎన్నికల్లో జగన్ కేవలం 11 సీట్లకు పరిమితమైన వాస్తవాన్ని గుర్తు చేశారు. ప్రజల అభిమతాన్ని అర్థం చేసుకోలేకే జగన్ ఓటమి చెందారని, ప్రజలు అసత్యాలను పట్టించుకోరని, దీనిపై ఆత్మపరిశీలన చేస్తే ఆయనకే మేలు జరుగుతుందని మంత్రి సత్యకుమార్ హితవు పలికారు.

## ఓర్వకల్లు రాక్ గార్డెన్ ను మరింత అభివృద్ధి చేస్తాం



- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- శ్రీశైలం, అహోబిలం, బెలూం గుహలు, యాగంటి తదితర ప్రదేశాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని హామీ

**అమరావతి/కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్) :** కర్నూలు జిల్లా ఓర్వకల్లులో సహజ సిద్ధంగా ఏర్పడ్డ ప్రఖ్యాత రాక్ గార్డెన్ అద్భుత ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా నిలుస్తోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారి సహాయార్థం మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన మానిటరింగ్ కోసం విజయవాడ కంట్రోల్ రూమ్ కు వెళ్లాలన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అనంతపురం నుండి విజయవాడ వస్తూ మార్గమధ్యలో కర్నూలు చేరుకున్న మంత్రి దుర్గేష్ ఫ్లైట్ కు సమయం ఉండటంతో సమీపంలోని ఓర్వకల్లు రాక్ గార్డెన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్శంగా రాక్ గార్డెన్ ను కలియ తిరిగారు. హరిత రిసార్ట్స్ ను, హరిత రెస్టారెంట్ ను పరిశీలించారు. అక్కడి అధికారులతో, సిబ్బందితో వివరాలు ఆరా తీశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీలో ప్రధానంగా కర్నూలు పరిసర ప్రాంతాల్లో ముఖ్యమైన పర్యాటక ప్రదేశాల్లో రాక్ గార్డెన్ ఒకటని అన్నారు. ఇక్కడ సహస సిద్ధమైన కొండల మధ్య ఉన్న రాతివనం, చెరువు, లక్షల ఏళ్ల క్రితం ఏర్పడ్డ వివిధ ఆకృతులతో కూడిన రాళ్లు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయన్నారు. ఓర్వకల్లులో హరిత రిసార్ట్స్ అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇక్కడి సహజ సిద్ధ నిర్మాణాలు, కట్టడాలు రాష్ట్ర గొప్పతనాన్ని చాటి చెబుతున్నాయన్నారు. ఓర్వకల్ ఎయిర్ పోర్టుతో స్థానిక పర్యాటక ప్రదేశాలకు అనుసంధానం పెరిగిందన్నారు. ప్రపంచ పర్యాటకులు సైతం ఓర్వకల్లు రాక్ గార్డెన్ సందర్శించేలా అభివృద్ధి చేస్తామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, అహోబిలం, బెలూం గుహలు, యాగంటి తదితర ప్రదేశాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామన్నారు. స్థానికంగా బాహుబలి, డాకు మహారాజ్ తదితర సినిమా షూటింగ్ లు జరిగాయని, రాబోయే రోజుల్లో రాక్ గార్డెన్ లో మరిన్ని షూటింగ్ లు జరుగుతాయని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు చొరవతో, కేంద్ర సహకారంతో ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకానుందని తద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా వెల్లడించారు.

అనంతరం నేపాల్‌లో చిక్కుకున్న ఏపీ వాసులను రక్షించేందుకు ఇప్పటికే ఏపీ ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు. నేపాల్ లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలుగువారికి అండగా నిలవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించినట్లు తెలిపారు. తెలుగు ప్రజల భద్రత తమకు ముఖ్యమన్న మంత్రి దుర్గేష్ తెలుగు ప్రజలను వీలైనంత త్వరగా సురక్షితంగా ఏపీకి తీసుకురావడానికి అవసరమైన రక్షణ, సహాయ కార్యకలాపాలను మంత్రి లోకేష్ తో కలిసి సమన్వయం చేస్తాను అని ఈ సందర్భంగా వెల్లడించారు.



Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467